Follow: @ANNTELUGU
10-02-2025
ANN తెలుగు
మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 70 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



# కటక్ వన్డేలో భారత్ ఘన విజయం

## 4 వికెట్ల తేడాతో ఇంగ్లాండ్‌పై భారత్ గెలుపు

స్కోర్లు: ఇంగ్లాండ్ ఆలౌట్, భారత్ 308/6.. 3 వన్డేల సిరీస్‌ను 20తో కైవసం చేసుకున్న భారత్


*కటక్: ఇంగ్లండ్‌తో కటక్ వేదికగా జరిగిన రెండో వన్డేలో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ చెలరేగి ఆడి జట్టుకు ఘన విజయాన్ని అందించాడు. ఇంగ్లండ్ నిర్దేశించిన 305 పరుగుల లక్ష్య ఛేదనలో టీమిండియా 44.3 ఓవర్లలోనే ఆరు వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. రోహిత్ శర్మ వీరవిహారంతో టీమిండియా అవలీలగా విజయం సాధించింది. ఫలితంగా సిరీస్‌ను 2-0 తేడాతో ఇంకోమ్యాచ్ ఉండగానే కైవసం చేసుకుంది టీమిండియా.*

వివరాలు 8లో

టాప్ న్యూస్

## 2026 మార్చి 31 నాటికి నక్సలిజం నుంచి విముక్తి

- ఎన్ కౌంటర్ ఘటనపై సామాజిక మాధ్యమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా
- జవాన్లను అభినందించిన హోం మంత్రి



03

## ఢిల్లీ సీఎం పదవికి అతిశీ రాజీనామా

- ఎల్జీకి రాజీనామా లేఖ అందజేసిన ఆప్ నేత
- అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఓటమితో రిజైన్
- కల్కాజీ నుంచి గెలుపొందిన అతిశీ



02

## కేటిఆర్ వ్యాఖ్యలను బీసీ సమాజం క్షమించదు

- టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఫైర్
- కులగణన దేశానికే ఆదర్శం
- సర్వేలో పాల్గొనని కేటీఆర్ రీసర్వే గురించి మాట్లాడడం విడ్డూరం



03

# దక్షిణాదిని శిక్షిస్తారా?

## వన్ నేషన్.. వన్ ఎలక్షన్ కాదు.. వన్ స్టేట్.. వన్ ఎలక్షన్ రావాలి

### ఒకే దేశం, ఒకే ఎన్నిక అంటే ఒకే వ్యక్తి.. ఒకే పార్టీ.. మోదీ రహస్య అజెండా అది

హక్కుల రక్షణ కోసం దక్షిణాది రాష్ట్రాలు చేతులు కలపాలి.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

కేరళలో జరిగిన మాతృభూమి ఇంటర్‌నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్ సదస్సులో సంచలన వ్యాఖ్యలు



**తిరువనంతపురం , మహా:** దేశానికి వన్ నేషన్.. వన్ ఎలక్షన్ కాదని, వన్ స్టేట్ వన్ ఎలక్షన్ రావాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఒకే దేశం.. ఒకే ఎన్నిక నిజానికి ఒకే వ్యక్తి.. ఒకే పార్టీ అనే విధానమని... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రహస్య అజెండా అదే అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజన మరో అంశమని.. కుటుంబ నియంత్రణ విధానంతో పాటు ఉత్తరాది రాష్ట్రాలతో పోల్చితే దక్షిణాది రాష్ట్రాలు మెరుగైన సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినందుకు దక్షిణాదిని శిక్షిస్తున్నారా అని ఆయన ప్రశ్నించారు. మలయాళీ దినపత్రిక మాతృభూమి కేరళ రాజధాని తిరువనంతపురంలో ఆదివారం ఏర్పాటు చేసిన మాతృభూమి ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. రాజ్యాంగం ప్రసాదించిన గ్యారంటీలను, మన హక్కులను రక్షించుకునేందుకు దక్షిణాది రాష్ట్రాలు చేతులు కలపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ కాదని, వన్ స్టేట్ వన్ ఎలక్షన్ వస్తే ప్రజలకు ఉపయోగమన్నారు.

**తెలంగాణ రైజింగ్ నాలుగు కోట్ల ప్రజలస్వప్నం**

తెలంగాణ రైజింగ్ అనేది నినాదం మాత్రమే కాదని...అది నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల స్వప్నమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు.

మిగతా 2లో

### 200 ఎకరాల్లో గాంధీ సరోవర్

హైదరాబాద్ పర్యావరణ సుస్థిరతకుగానూ మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు చేపట్టాం.. మూసా... ఈసా నదుల కలయికే మూసీ... గత యాభై ఏళ్లుగా కాలుష్యం కోరల్లో చిక్కి మూసీ కనుమరుగయ్యే స్థితికి చేరింది.. మా ప్రభుత్వం మూసీకి పూర్వ వైభవం తేవాలనుకుంటోంది. గోదావరి నీటిని మూసీలో కలపడం ద్వారా త్రివేణి సంగమంగా మార్చనున్నాం.. అక్కడే 200 ఎకరాల్లో గాంధీ సరోవర్‌ను నిర్మిస్తున్నాం. దక్షిణాది రాష్ట్రాల్లో తీర ప్రాంతం లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ . ఈ నేపథ్యంలో మేం డ్రై పోర్ట్ నిర్మించనున్నాం. దానిని ఆంధ్రప్రదేశ్‌లోని సీ పోర్ట్ కు ప్రత్యేక రైలు, రోడ్డు మార్గం ద్వారా కలుపుతాం. హైదరాబాద్ వృద్ధి చెందితేనే తెలంగాణ రైజింగ్ సాధ్యమవుతుంది. అభివృద్ధి మొదట నగరాలతోనే మొదలవుతుందనేది నా భావన... హైదరాబాద్ రైజింగ్ కావాలంటే అది వేగవంతమైన, పరిశుభ్రమైన, సురక్షితమైన, అవకాశాలు కల్పించే నగరంగా ఉండాలి. మేం రీజినల్ రింగు రోడ్డును, రీజినల్ రింగు రైల్వే లైను నిర్మించబోతున్నాం...ఈ రెండింటిని రేడియల్ రోడ్ల ద్వారా కలపనున్నాం. అని సీఎం రేవంత్ వివరించారు.

### నెంబర్ వన్ తెలంగాణ

కేంద్ర ప్రభుత్వ తాజా ఆర్థిక సర్వే నివేదిక ప్రకారం అతి తక్కువ ద్రవ్యోల్బణం ఉన్న రాష్ట్రం తెలంగాణ అని సీఎం అన్నారు. గ్లోబల్ ఏఐ యూసేజ్ రిపోర్ట్ ప్రకారం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లో వినియోగంలో మేం ప్రథమ స్థానంలో ఉన్నాం. తలసరి ఆదాయంలోనూ మేం ప్రథమ స్థానంలో ఉన్నాం. * ఇప్పుడు నేను మీ అందరిని ప్రశిస్తున్నాం... మా రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వకూడదా..? అని సీఎం ప్రశ్నించారు. తెలంగాణ ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థ అయితే అది భారతదేశ వృద్ధికి ప్రయోజనం కాదా..? కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు మద్దతుగా నిలవడం లేదు. ప్రత్యేకించి దక్షిణాది రాష్ట్రాలు, బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలకు మద్దతుగా నిలవడం లేదని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు.



## టిఫిన్ చేసి వచ్చేలోపు రూ.23 లక్షలు మాయం

- ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో చోరీ
- నార్కట్‌పల్లి పూజిత హోటల్ వద్ద సంఘటన

వివరాలు 3లో




## గ్రేడ్ మారిన గజ్వేల్ మునిసిపాలిటీ

- మున్సిపాలిటీలో మల్లన్న సాగర్ ముంపు గ్రామాలు విలీనం
- ఏడు పంచాయతీలను డీనోటిఫై చేసిన ఆఫీసర్లు
- మారనున్న గజ్వేల్ మున్సిపల్ గ్రేడ్, పెరగనున్న వార్డులు

వివరాలు 2లో



## కులగణన తప్పులతడక

- రీసర్వే చేయాలని కేటీఆర్ డిమాండ్

వివరాలు 3లో

### శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారంలో కీలక పరిణామాలు

నలుగురిని అరెస్టు చేసిన సిబిఐ 03



మేడారం వనదేవతలను దర్శించుకున్న సీతక్క

## ప్రగతి రథ చక్రాలు ఆగుతాయా


### ఆర్టీసీలో హోరెత్తుతున్న సమ్మె సైరన్

- ఏ క్షణమైనా నిరవధిక సమ్మెకు వెళ్లే అవకాశాలు
- హైదరాబాద్‌లో టీఎంయూ విస్తృత స్థాయి సమావేశం
- లేబర్ కమిషన్ ఎదుట యాజమాన్యంతో చర్చలకు యాజమాన్యం, జేఏసీలు సన్నద్ధం
- 21 డిమాండ్లు నెరవేర్చాలని జేఏసీ డిమాండ్
- కార్మికులను ప్రలోభ పెట్టే ప్రయత్నంలో యాజమాన్యం
- హక్కుల సాధనకే ప్రాధాన్యతనిస్తున్న ఆర్టీసీ కార్మికులు



**మహా:** ఆర్టీసీలో అలజడి మొదలైంది. కాంగ్రెస్ ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యంతో అమీ.. తుమీ తేల్చుకునేందుకు కార్మిక సంఘాలు సిద్ధమవుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం హైదరాబాద్‌లో ఆర్టీసీలో కీలకమైన టీఎంయూ రాష్ట్రస్థాయి విస్తృత సమావేశాన్ని నిర్వహించింది. అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను మరచి మభ్యపెడుతున్న తీరు కార్మికులును ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యల పరిష్కారంలో యాజమాన్యం కూడా మొండి వైఖరిని ప్రదర్శిస్తోంది. ఈ నేపథ్యంలో గత నెల 27న ఆర్టీసీ ఎండీని కలిసి 21 అంశాలపై ఆరు సంఘాల జేఏసీ తమ డిమాండ్లను అందించింది. వీటిపై ఎట్ట కేలకు దిగివచ్చిన యాజమాన్యం ఈ నెల 10న కార్మిక శాఖ కమిషనర్ సమక్షంలో చర్చలకు ఆహ్వానించింది. ఈ చర్చలు సఫలం కాకుంటే ఏ క్షణమైనా సమ్మెకు వెళ్లేందుకు కార్మిక సంఘాలు సంసిద్ధమవుతున్నాయి.

మిగతా 2లో



## చత్తీస్‌గఢ్ అడవుల్లో రక్తపుటేరులు

- 31 మంది మావోయిస్టులు హతం, ఇద్దరు జవాన్లు వీరమరణం
- మృతుల్లో అగ్రనేతలున్నారా?
- భద్రతా బలగాల దూకుడు – మావోయిస్టులకు భారీ దెబ్బ
- నక్సలైట్లు కోలుకోలేని సంక్షోభంలోకి జారిపోయారా?

03

## బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల కుట్ర

### రెండు పార్టీలు లోపాయికారి ఒప్పందం చేసుకున్నాయి

అరెస్టుల నుంచి తప్పించుకునేందుకు కాంగ్రెస్ తో బీఆర్ఎస్ మిలాఖత్

కాంగ్రెస్ ను గెలిపించేందుకే ఈ నిర్ణయం.. బీసీల్లో ముస్లింలను ఎలా చేరుస్తారు?

కాంగ్రెస్ పాలనలో భ్రష్టు పట్టిన విద్యా వ్యవస్థ.. అర్బన్ నక్సల్స్ చేతిలో విద్యా వ్యవస్థ బంధీ

ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్ ను నిలదీయండి

కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

**మహా :** ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ రెండు పార్టీలు ఏకమై బీజేపీతో పోరుకు దిగుతున్నాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సరైన అభ్యర్థులే కరువయ్యారన్నారు. దేశ చరిత్రలో అధికార పార్టీకి మంచి అభ్యర్థులు కరువైపోవడం విచిత్రంగా ఉందని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఆదివారం నల్లగొండలో జరిగిన ఎన్నికల కార్యశాలలో పాల్గొన్న సంజయ్ గెలుపుపై దిశానిర్దేశం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపైన, బీసీ సంఘాల తీరుపైన నిప్పులు చెరిగారు. ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటయ్యాయని, ఆ రెండు పార్టీల మధ్య

మిగతా 3లో



# దక్షిణాదిని శిక్షిస్తారా?

## వన్ నేషన్.. వన్ ఎలక్షన్ కాదు.. వన్ స్టేట్.. వన్ ఎలక్షన్ రావాలి

### ఒకే దేశం, ఒకే ఎన్నిక అంటే ఒకే వ్యక్తి.. ఒకే పార్టీ.. మోదీ రహస్య అజెండా అది

### హక్కుల రక్షణ కోసం దక్షిణాది రాష్ట్రాలు చేతులు కలపాలి.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### కేరళలో జరిగిన మాతృభూమి ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్ సదస్సులో సంచలన వ్యాఖ్యలు

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణను భారత దేశంలోనే కాదు ప్రపంచంలోనే అత్యుత్తమంగా నిలపాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు సీఎం తెలిపారు. తెలంగాణ రైజింగ్.. విజన్ 2050, దక్షిణాది రాష్ట్రాలు ఎందుకు కలిసి పని చేయాలనే దానిపై ముఖ్యమంత్రి ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది. 60 ఏళ్ల కలను నెరవేర్చినందున తెలంగాణ ప్రజలు సోనియా గాంధీని ఎంతగానో ప్రేమిస్తున్నారు. తన పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ కోసం చేసింది ఏం లేదు. ఆ పార్టీ నాయకులు ఎన్నో వాగ్దానాలు చేశారే తప్ప వాటిని నెరవేర్చలేదు. తెలంగాణ జీడీపీ సుమారు 200 బిలియన్ యూఎస్ డాలర్లుగా ఉంది... 2035 నాటికి దానిని ఒక ట్రిలియన్ యూఎస్ డాలర్లుగా మార్చాలనుకుంటున్నాం. తెలంగాణను హైదరాబాద్ కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్ అనే మూడు జోన్లుగా విభజించాం. 160 కిలోమీటర్ల పొడవైన అవుటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్) పరిధిలోని కోర్ అర్బన్ ఏరియాలో 1.2 కోట్ల ప్రజలు నివసిస్తున్నారు. ఈ ప్రాంతం సాఫ్ట్ వేర్, ఫార్మా రంగాలకు కేంద్రంగా ఉంది. చార్మినార్, హైదరాబాద్ బిర్యానీ, ముత్యాలకు హైదరాబాద్ ప్రసిద్ధి. ఓఆర్ఆర్ పరిధిలోని ఈ కోర్ అర్బన్ ఏరియాను సర్వీస్ సెకార్ట్స్‌తో 100 శాతం నెట్ జీరోగా మార్పు చేయనున్నాం. ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు మేం పలు కార్యక్రమాలు చేపడుతున్నాం. దేశంలోని ముంబయి, ఢిల్లీ, బెంగళూర్, చెన్నై వంటి నగరాలతో కాకుండా ప్రపంచంలోని ముఖ్య నగరాలైన న్యూయార్క్, లండన్, సింగపూర్, టోక్యో, సియోల్ వంటి నగరాలతో పోటీపడేలా హైదరాబాద్ ఉండాలనుకుంటున్నాం. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నాం.. ఇది భారతదేశంలోని పూర్తి



హరిత, పరిశుభ్రమైన, అత్యుత్తమమైన నగరంగా ఉండనుంది. ప్రపంచంలోని మరే నగరంతో పోల్చుకున్నా ఇది సరైన ప్రణాళిక, జోన్లు ఉన్న నగరంగా ఉండనుంది. ఇది మొట్టమొదటి నెట్ జీరో సిటీ. ఫ్యూచర్ సిటీలో మేం ఎఐ సిటీని నిర్మిస్తున్నాం.. యువత కోసం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మిస్తున్నాం. ఈ ఏడాది దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో నేను పాల్గొన్నా. రూ.1,82,000 కోట్లకు పైగా పెట్టుబడులను తెలంగాణకు తీసుకురాగలిగాం. గతేడాది రూ.40 వేల పెట్టుబడులు వచ్చాయి.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనా కాలంలో రూ.25 వేల కోట్ల పెట్టుబడులను సాధించలేకపోయిందని సీఎం అన్నారు.

**దక్షిణాది రాష్ట్రాలకు ముఖ ద్వారం**

దేశంలోని ఉత్తర, దక్షిణ, తూర్పు, పడమర దిక్కులకు అనుసంధానమై, దక్షిణాది రాష్ట్రాలకు ముఖ ద్వారంగా ఉన్న తెలంగాణ దేశానికి లాజిస్టిక్ సెంటర్‌గా ఉండాలని మేం ఆకాంక్షిస్తున్నాం. ఆర్ఆర్ఆర్ వెలుపల నుంచి రాష్ట్ర సరిహద్దుల వరకు ఉన్న గ్రామాలను మార్చాలనుకుంటున్నాం. గ్రామాల్లోనూ అత్యుత్తమ వసతులు కల్పిస్తాం.. రైతులకు 24 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా ఇస్తున్నాం... రైతులకు ఎకరాకు రూ.12 వేలు రైతు భరోసా ఇస్తున్నాం.. భూమి లేని కుటుంబాలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తున్నాం. పంటలకు కనీస మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నాం. దేశంలోనే రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. 25 లక్షల రైతు కుటుంబాలకు రూ.21 వేల కోట్ల రుణ మాఫీ చేశాం. కేవలం మౌలిక వసతుల వృద్ధితోనే తెలంగాణ రైజింగ్ కాదు... రైతులు, మహిళలు, యువత, పిల్లలు, వయోధికుల అందరి విషయంలోనూ మేం దృష్టి పెడుతున్నాం.. తెలంగాణ రైజింగ్‌లో వారూ భాగమే. రాజీవ్ ఆరోగ్య శ్రీ లో రూ.10 లక్షల మేర హెల్త్ కవరేజీ ఇస్తున్నాం.. ఆరోగ్య సమస్యలతో తెలంగాణలో ఎవరైనా ఏ ఆసుపత్రికి వెళ్లినా మేం చూసుకుంటున్నాం. విద్యా, నైపుణ్యాలు నా ప్రథమ ప్రాధాన్యాలు... అన్ని గురుకులాల్లో మెస్ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలను రెట్టింపు చేశాం.. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నాం. తెలంగాణలో మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించాం. అక్కా చెల్లెళ్లకు రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నాం. ఇళ్లకు 200 యూనిట్లు లోపు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీ విధానం... దళితులు, ఓబీసీలు, గిరిజనులు, మైనారిటీలకు సామాజిక న్యాయం చేస్తామని మా నాయకుడు రాహుల్ గాంధీ అభయమిచ్చారు. సమగ్ర కుల సర్వే చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ.. దానిని అసెంబ్లీలోనూ ప్రవేశపెట్టాం. జనాభా దామాషా ప్రాతిపదికన మేం వనరులు సమకూర్చుతాం అని సీఎం ప్రకటించారు. సుపరిపాలన ఏడాదిలోనే ఎంత మార్పు తెస్తుందనేందుకు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒక ఉదాహరణ అన్నారు.




## గ్రేడ్ మారిన గజ్వేల్ మునిసిపాలిటీ

### మున్సిపాలిటీలో మల్లన్న సాగర్ ముంపు గ్రామాలు విలీనం

### ఏడు పంచాయతీలను డీనోటిఫై చేసిన ఆఫీసర్లు

### మారనున్న గజ్వేల్ మున్సిపల్ గ్రేడ్, పెరగనున్న వార్డులు

**మహా :** మల్లన్న సాగర్‌తో ముంపుకు గురైన ఏడు గ్రామ పంచాయతీలు గజ్వేల్ మున్సిపాలిటీలో విలీనమయ్యాయి. ఇప్పటివరకు పంచాయతీలుగా కొనసాగిన ఏడు గ్రామాలను పంచాయతీ రాజ్ శాఖ డీనోటిఫైడ్ చేయడంతో అవి అధికారికంగా గజ్వేల్ మున్సిపాలిటీలో కలిసిపోయాయి. దీంతో గజ్వేల్ మున్సిపాలిటీ గ్రేడ్ మారడమే కాకుండా, వార్డుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంది. మల్లన్న సాగర్ నిర్మాణంతో తొగుట మండలంలోని వేములఘాట్, బ్రాహ్మణ బంజేరుపల్లి, లక్ష్మాపూర్, పల్లెపహాడ్, ఏటిగడ్డ కిష్టాపూర్, కొండపాక మండలంలోని సింగారం, ఎర్రవల్లి గ్రామాలు ముంపునకు గురయ్యాయి. దీంతో గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలో ఆర్ అండ్ ఆర్ కాలనీని నిర్మించి నాలుగేండ్ల కింద నిర్వాసితులను అక్కడికి తరలించారు. గతేడాది సెప్టెంబర్‌లో గ్రామ పంచాయతీల ఓటరు లిస్ట్ విడుదల చేసిన ఆఫీసర్లు కొన్ని గ్రామాల లిస్ట్‌ను పెండింగ్‌లో పెట్టారు. రెండు రోజుల క్రితం మరో 17 గ్రామ పంచాయతీల లిస్ట్‌ను విడుదల చేసి ముంపు గ్రామాలను డీ నోటిఫై చేశారు. దీంతో ఆ గ్రామాలు గజ్వేల్ మున్సిపాలిటీలో విలీనం అయినట్లేనని, ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేయాల్సిన అవసరం ఉండదని డీపీవో జానకీదేవి చెప్పారు. అయితే విలీనాన్ని వ్యతిరేకిస్తే మాత్రం పాలకవర్గం ఆమోదించిన తీర్మానాన్ని ప్రభుత్వానికి అందజేయాల్సి ఉంటుందని తెలిపారు.

**ముంపు గ్రామాల్లో ఏడు వేలకు పైగా ఓట్లు**

గజ్వేల్‌లోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఏడు ముంపు గ్రామాల పరిధిలో 15 వేల జనాభా ఉండగా, ఏడు వేలకు పైగా ఓటర్లు ఉన్నారు. ఈ గ్రామాలు విలీనం కావడంతో గజ్వేల్ మున్సిపాలిటీలో వార్డులతో పాటు జనాభా కూడా పెరిగి గ్రేడ్ 2 గా అప్‌గ్రేడ్ అయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం గజ్వేల్ పరిధిలో ప్రజ్ఞాపూర్, రాజిరెడ్డిపల్లి, సంగాపూర్, క్యాసారం, ముట్రాజ్‌పల్లి గ్రామాల్లో సుమారు 50 వేలకు పైగా జనాభా ఉంది. ఆర్ అండ్ ఆర్ కాలనీలోని జనాభాను కలుపుకుంటే 70 వేలకు చేరే అవకాశం ఉంది. మున్సిపాలిటీలో ప్రస్తుతం 20 వార్డులు ఉండగా, కొత్త గ్రామాల విలీనంతో మరో 10 వరకు వార్డులు పెరిగే చాన్స్ ఉంది.

**నిర్వాసితుల్లో భిన్నాభిప్రాయాలు**

మల్లన్నసాగర్ ముంపు గ్రామాలను గజ్వేల్ మున్సిపాలిటీలో విలీనం చేయడం పట్ల నిర్వాసితుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మున్సిపాలిటీలో విలీనం వల్ల పన్నుల భారం పెరుగుతుందని కొందరు అభిప్రాయపడుతుంటే.. అభివృద్ధిలో వేగం పెరుగుతుందని మరికొందరు అంటున్నారు. మరో వైపు ఈజీఎస్ జాబ్‌కార్డులు రద్దు అవడంతో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అర్హులం కాకుండా పోయామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## ఢిల్లీ సీఎం పదవికి అతిశీ రాజీనామా

- ఎల్జీకి రాజీనామా లేఖ అందజేసిన ఆప్ నేత
- అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఓటమితో రిజైన్
- కల్కాజీ నుంచి గెలుపొందిన అతిశీ

**మహా :** ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సీనియర్ నేత అతిశీ మార్లేనా రాజీనామా చేశారు. ఈమేరకు ఆదివారం ఉదయం ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె. సక్సేనాకు తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఓటమి నేపథ్యంలో అతిశీ సీఎం పదవికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా అతిశీ మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తమ పార్టీకి పెద్ద ఎదురుదెబ్బ అని వ్యాఖ్యానించారు. పార్టీ ఓటమి పాలైనప్పటికీ బీజేపీ అక్రమాలు, అవినీతిపై తాము చేస్తున్న పోరాటం మాత్రం ఆపబోమని స్పష్టం చేశారు. పార్టీలో కీలక నేతలు ఓడిపోవడం విచారకరమని అన్నారు. తనపై నమ్మకంతో గెలిపించిన కల్కాజీ ఓటర్లకు అతిశీ మరోసారి ధన్యవాదాలు తెలిపారు.

కాగా, ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో జైలుపాలైనప్పటికీ సీఎం పదవిని అంటిపెట్టుకుని ఉన్న కేజ్రీవాల్ బెయిల్ పై బయటకు వచ్చాక రాజీనామా చేశారు. పార్టీ సీనియర్ నేత అతిశీని ముఖ్యమంత్రి పదవిలో కూర్చోబెట్టారు. అనూహ్యంగా దక్కిన సీఎం పదవిలో బాధ్యతగా పని చేస్తూనే ఎన్నికల తర్వాత మళ్లీ కేజ్రీవాలే సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారని అతిశీ చెబుతూ వచ్చారు. అయితే, తాజా ఎన్నికల్లో కేజ్రీవాల్ సహా పార్టీ కీలక నేతలు ఓటమి పాలవడం, సీఎం పదవి కోసం కావాల్సినన్ని స్థానాల్లో ఆప్ ఎమ్మెల్యేలు గెలవకపోవడంతో అతిశీ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది.

# ప్రగతి రథ చక్రాలు ఆగుతాయా

(మొదటిపేజీ తరువాయి)

ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై యాజమాన్యానికి ఎన్నో సార్లు విజ్ఞప్తులు, విన్నపాలు చేస్తూ వచ్చారు. అనేక పెండింగ్ సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం అనుసరిస్తున్న మొండి వైఖరిపై కార్మికులు విసిగిపోయారు. ఇటు అధికారంలోకి రాక ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలులోకి తేకపోవడంపైనా కార్మికులు రగిలి పోతున్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి, కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానమైన వేతనాలు అందిస్తామని, రెండు పీఆర్సీ బకాయిలు చెల్లిస్తామని, వచ్చే పీఆర్సీలో ఆర్టీసీ కార్మికులను చేరుస్తామని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని వసతులు, సదుపాయాలు కల్పిస్తామని, ఆర్టీసీ బస్సులను ఆధునీకరిస్తామని, అధునాతమైన సౌకర్యాలతో కొత్త సర్వీసులు ప్రారంభిస్తామని, ఆర్టీసీ యూనియన్ల పునరుద్ధరణకు అనుమతిస్తామని ఇంకా అనేక హామీలను కార్మికులకు ఇచ్చింది.




ఓట్ల కోసం ఇచ్చిన ఈ హామీల్లో అధికారంలోకి వచ్చిన 14 నెలల్లో వాటి ఊసే ఎత్తడం లేదని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కార్మిక సంఘాల నాయకులు ప్రభుత్వ పెద్దలను కలిసేందుకు వెళ్లినపుడల్లా అవమానాలకు గురవుతున్నారు. మంత్రులు మొదలు, ముఖ్యమంత్రి వరకు తమ పట్ల ఎన్నికలకు ముందు ఒక తీరు.. ఇప్పుడు మరో తీరు ప్రవర్తిస్తున్నారని ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు మండిపడుతున్నారు. 14 నెలల వరకు సహనం వహించిన కార్మికులు, సంఘాలు ఇటు యాజమాన్యంతో అటు ప్రభుత్వంతో అమీ.. తుమీ తేల్చుకోవాలనే నిర్ణయానికి వచ్చాయి. అందులో భాగంగానే ఆర్టీసీ కార్మిక సంఘాలైన టీఎంయూ, ఎంప్లాయిస్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్, బీకేయూ, బీడబ్ల్యూకే, కార్మిక పరిషత్ జేఏసీగా ఏర్పడి గత నెల 27న ఆర్టీసీ సీఎండీ, ఇతర ఉన్నతాధికారులను కలిసి 21 అంశాలతో తమ డిమాండ్లను అందించాయి. వాటిని తక్షణమే పరిష్కరించాలని, లేని పక్షంలో నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించాయి.

**కార్మికుల్లో కదలిక**

తమ డిమాండ్లపై ఈ నెల 9 వరకు స్పందించాలని గత నెల 27న ఇచ్చిన సమ్మె నోటీసులో కార్మిక సంఘాల జేఏసీ పేర్కొన్నది. అయితే, సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు యాజమాన్యం కుట్రలు చేస్తోందని కార్మిక సంఘాల నేతలు అంటున్నారు. డిపోల ఎదుట గేట్ మీటింగ్‌లు పెట్టి కార్మికులు, ఉద్యోగులకు ఆర్టీసీ యాజమాన్యం ఇప్పటి వరకు కల్పించిన సదుపాయాలను వివరించే ప్రయత్నం చేస్తోంది. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు షిఫుల్లో విధులకు హాజరయ్యే కార్మికులకు డిపోల మేనేజర్లు, ఇతర అధికారులు గేట్ మీటింగ్‌లు తీసుకుంటూ యాజమాన్యానికి నివేదికలు ఇస్తున్నారు. అధికారులు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా తమ సంఘాలు తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని కార్మికులు స్పష్టం చేస్తున్నారు. కాగా, మునుపెన్నడూ లేని విధంగా ఆర్టీసీ కార్మికుల్లో కదలిక కనిపిస్తోంది. సమ్మెకు ఎప్పుడు పిలుపునిస్తే అప్పుడు దిగేందుకు సిద్ధంగా ఉన్నామని కార్మికులు ముక్తకంఠంతో స్పష్టం చేస్తున్నారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సందర్భంగా ఏకరవు పెడుతున్నారు. ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన మేనిఫెస్టో హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మాస్టర్ స్కేల్ విధానం ఆర్టీసీకి కార్మకులకు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తున్నారు. పని భారంతో గుండె పోట్లకు గురై మరణిస్తుంటే యాజమాన్యం చెకింగ్‌ల పేరుతో తమని వేదిస్తోందని కండక్టర్లు, డ్రైవర్లు వాపోతున్నారు. ఆధునికత పేరుతో కార్పొరేట్ సంస్థలకు చెందిన ఎలక్ట్రికల్ బస్సులను అద్దెకు తెచ్చి ఆర్టీసీని ప్రైవేట్‌పరం చేసే కుట్రకు తెర తీశారని మండిపడుతున్నారు. ఈ బస్సుల్లో పనిచేస్తున్న డ్రైవర్లకు, ఆర్టీసీకి సంబంధం లేదని, ఈ బస్సుల కోసం ఆర్టీసీ ఆస్తులను ప్రభుత్వం ధారాదత్తం చేస్తున్నదని ఆరోపిస్తున్నారు. ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ యాజమాన్యమే నడపాలని, ప్రైవేట్ గుత్తాధిపత్యం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. ఈ బస్సుల ప్రవేశంతో తమకు ఉద్యోగ భద్రత కరువవుతోందని వాపోతున్నారు. గత పదేళ్లలో ఆర్టీసీలో రిక్రూట్‌మెంట్ లేక పోవడంతో ఉద్యోగులపై విపరీతమైన పని భారం పెరిగిందని, సంస్థలో ఉద్యోగులు రిటైర్డ్ అయిన తర్వాత ఉన్నవారితోనే పనిచేయిస్తున్నారని, పనిభారం తట్టుకోలేక ఆర్టీసీ కార్మికులు అనారోగ్యం బారిన పడుతున్నారని, దీనికి తోడు యాజమాన్యం వేధింపులు రోజు రోజుకూ పెరుగుతున్నాయని వాపోతున్నారు. 14 నుంచి 16 గంటలు డ్యూటీ చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదేళ్లుగా కార్మికులకు రావాల్సిన ఎన్‌క్యాష్‌మెంట్ ఇంత వరకు చెల్లించలేదని, కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర అవస్థలు పడుతున్నా యాజమాన్యం పట్టింపు లేకుండా వ్యవహరిస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి. 2024 నుంచి రిటైర్మెంట్ పొందిన ఉద్యోగులు, కార్మికులకు గ్రాట్యుటీ చెల్లించక పోవడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. గడిచిన ఐదేళ్లుగా యూనిఫాం కూడా ఇవ్వడం లేదని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. ఇలా అనేక సమస్యలను సమ్మె నోటీసులో ప్రస్తావించిన జేఏసీ నాయకులు.. ఇప్పటికైనా తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

**చర్చలు ఫలించకపోతే సమ్మె అనివార్యం**

ఈ నెల 10న హైదరాబాద్‌లోని కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ కార్యాలయంలో ఆర్టీసీ యాజమాన్యం, జేఏసీ నాయకులతో చర్చించేందుకు శుక్రవారం నోటీసులు ఇచ్చింది. 10న సాయంత్రం 4 గంటలకు జరగబోయే చర్చల్లో జేఏసీలోని ఏడు సంఘాల నాయకులు హాజరవుతున్నారు. కార్మికులు సమ్మెకు వెళ్తే ఎదురయ్యే పరిణామాలపై ఇప్పటికే ఆర్టీసీ యాజమాన్యంలో చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది. యాజమాన్యం చేతిలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ముందుకు వస్తుందా? లేదా?, కార్మిక సంఘాలు ఇచ్చిన 21 డిమాండ్లలో ఎన్నింటికి అంగీకరిస్తుందనేది ఆసక్తిగా మారింది. కార్మిక సంఘాలు మాత్రం తామిచ్చిన 21 డిమాండ్లలో అన్నింటినీ పరిష్కరించాలని గట్టి నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం తీసుకోవాల్సిన విధాన పరమైన నిర్ణయాలపైనా యాజమాన్యమే చర్చించాలని కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్ చేస్తోంది. యాజమాన్యమే ప్రభుత్వంతో చర్చలు జరిపి సానుకూల నిర్ణయాలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతోంది. అయితే, యాజమాన్యం తమ డిమాండ్లను అంగీకరించకుంటే.. తదుపరి చేపట్టే కార్యక్రమాలపై కార్మిక సంఘాలు చర్చలు జరుపుతున్నాయి. ఇప్పటికే సమ్మె పోస్టర్లను కూడా జేఏసీ ఆధ్వర్యంలో విడుదల చేశారు. జేఏసీలో చేరిన కార్మిక సంఘాలు కూడా సన్నాహక సమావేశాలకు సిద్ధమవుతున్నాయి. అందులో భాగంగా ఆర్టీసీలో అతి పెద్ద కార్మిక సంఘమైన తెలంగాణ మజ్దూర్ యూనియన్ ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారంరెడ్డి థామస్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తోంది. ఇది సమ్మె సన్నాహక సమావేశమేనని ఆర్టీసీ కార్మికులు స్పష్టం చేస్తున్నారు.

## చర్చల తర్వాతే నిర్ణయం

"ఆర్టీసీ యాజమాన్యం ఎట్టకేలకు చర్చలు జరిపేందుకు దిగి వచ్చింది. కార్మిక శాఖ మధ్యవర్తిత్వం వహిస్తోంది. ఈ నెల 10న హైదరాబాద్‌లోని టంగుటూరి అంజయ్య భవన్‌లో చర్చలకు సమయం ఇచ్చారు. మేం పెట్టిన డిమాండ్లన్నింటినీ పరిష్కరించాల్సిందే. సమ్మె చేయాలనేది మా ఉద్దేశం కాదని ముందే ప్రకటించాం. మాపై యాజమాన్యం, ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలు మారాలని కోరుతున్నాం. మా న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని అడుగుతున్నాం. ఎలాంటి అగ్రిమెంట్లు లేకుండా ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ సమకూర్చుకుంటోంది. ఆర్టీసీ ఆస్తులను ధారాదత్తం చేస్తోంది. ఇవన్నీ ఆర్టీసీని ప్రైవేటీకరించేందుకు జరుగుతున్న కుట్రలుగా మేం భావించాల్సి వస్తోంది. ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీయే సమకూర్చుకోవచ్చు కదా!. ఇందులో ప్రైవేట్ పెత్తనం ఏంటి?. వీటి వల్ల కార్మికుల భద్రతకు, ఆర్టీసీకి ముప్పువాటిల్లే ప్రమాదం ఉంది. మేం స్పష్టమైన ఎజెండాతో వెళ్తాం. అంతే కాకుండా, ప్రభుత్వం తీసుకోవాల్సిన విధాన పరమైన నిర్ణయాల విషయంలోనూ యాజమాన్యమే చొరవ తీసుకోవాలి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలనేది కూడా మా డిమాండ్లలో ప్రధానమైనది. ఆర్టీసీ యాజమాన్యంతో జరిగే చర్చల రిజల్ట్‌ను బట్టి సమ్మె నిర్ణయం తీసుకుంటాం. జేఏసీలో మరో సంఘం చేరడంతో ఏడుకు చేరాయి. ఈ నెల 10న చర్చలు విఫలమైతే సమ్మె ఎప్పటి నుంచి అనేది ప్రకటిస్తాం.

**– మారంరెడ్డి థామస్ రెడ్డి, టీఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆర్టీసీ జేఏసీ వైస్ చైర్మన్**

## కార్మికులను ప్రలోభ పెడుతున్నరు


"మా సమస్యల పరిష్కారం కోసం సమ్మెకు దిగుతామని గత నెల 27న నోటీసు ఇచ్చినప్పటి నుంచి ఆర్టీసీ యాజమాన్యం కార్మికులను ప్రలోభ పెడుతోంది. ప్రతి డిపో ఎదుట ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు షిఫ్టుల్లో విధులకు హాజరయ్యే కార్మికులకు గేట్ మీటింగ్‌లు పెట్టి అధికారులు మాయ మాటలు చెబుతున్నరు. సమ్మెకు వెళ్తే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని భయపెడుతున్నరు. అయినా, కార్మికులు వినే స్థితిలో లేరు. ఏండ్ల తరబడిగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించుకునేందుకు సమ్మె ఒక్కటే మార్గమనే నిర్ణయానికి వచ్చారు. ఆర్టీసీని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. సమ్మె అనివార్యమైతే అన్ని రాజకీయ పక్షాల మద్దతు కోరుతున్నం. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ విలీన ప్రక్రియ 90 శాతం పూర్తయ్యింది. మిగతా 10 శాతం పూర్తి చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పుడు పట్టించుకోవడం లేదు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన ప్రతి హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నం.

**– ఎంపీ రెడ్డి, ఆర్టీసీ జేఏసీ, కరీంనగర్ జిల్లా చైర్మన్**

# బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల కుట్ర

**రెండు పార్టీలు లోపాయికారి ఒప్పందం చేసుకున్నాయి**

- అరెస్టుల నుంచి తప్పించుకునేందుకు కాంగ్రెస్ తో బీఆర్ఎస్ మిలాఖత్
- కాంగ్రెస్ ను గెలిపించేందుకే ఈ నిర్ణయం.. బీసీల్లో ముస్లింలను ఎలా చేరుస్తారు?
- కాంగ్రెస్ పాలనలో భ్రష్టు పట్టిన విద్యా వ్యవస్థ.. అర్బన్ నక్సల్స్ చేతిలో విద్యా వ్యవస్థ బంధీ
- ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్ ను నిలదీయండి
- కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు



(మొదటిపేజీ తరువాయి)

లోపాయికారీ ఒప్పందం కుదిరిందన్నారు. కాళేశ్వరం, డ్రగ్స్, ఫార్ములా ఈ రేస్ సహా పలు అవినీతి కేసుల్లో ఇరుక్కుపోయిన బీఆర్ఎస్ నేతలు అరెస్ట్ కాకుండా రక్షించేందుకు కాంగ్రెస్ సిద్ధమైందని, అందుకు ప్రతిఫలంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టకుండా కాంగ్రెస్ ను గెలిపించడమే లక్ష్యంగా బీఆర్ఎస్ పనిచేస్తోందన్నారు. రెండు పార్టీలు కలిసి బీజేపీని గెలవనీయకూడదని కుట్ర పన్నాయన్నారు. రెండు పార్టీల మధ్య ఒప్పందం లేకపోతే బీఆర్ఎస్ పార్టీ తమ అభఅయర్థులను ఎందకు ఎన్నికల్లో నిలపలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటేయాలి? నిరుద్యోగ భృతి 4 వేల రూపాయలిస్తామని ఇవ్వనందుకా అని అడిగారు. ప్రతి నిరుద్యోగికి కాంగ్రెస్ 56 వేల రూపాయలు రేవంత్ రెడ్డి ప్రభుత్వం బాకీ పడిందని, ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నేతలను గల్లా పట్టి 14 నెలల బకాయి ఇవ్వాలని నిలదీయండని నిరుద్యోగులకు పిలుపునిచ్చారు. తొలి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారంటూ కేవలం 25 వేల ఉద్యోగాలకే నోటిఫికేషన్ ఇచ్చి 50 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని దుష్ప్రచారం చేసుకుంటున్నారని విరుచుకుపడ్డారు. మీ వద్దకు వచ్చే కాంగ్రెస్ నేతలను 2 లక్షల ఉద్యోగలేమయ్యాయని నిలదీయాలన్నారు. 18 ఏళ్లు నిండి చదువుకునే ప్రతి మహిళకు స్కూటీ ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఒక్కరికి కూడా స్కూటీ ఇవ్వలేదన్నారు. విద్యార్థులకు 5 లక్షల భరోసా కార్డు ఎక్కడుందనన్నారు. ఓట్ల కోసం వచ్చే సీఎం, మంత్రులను భరోసా కార్డు ఎందుకివ్వలేదో, ఎప్పుడిస్తరో సమాధానం చెప్పాలని నిలదీయండన్నారు. ఫీజు రీయంబర్స్ మెంట్ అందక లక్షలాది మంది విద్యార్థులు అల్లాడుతున్నారని, కాలేజీలు మూతపడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులను కాంగ్రెస్ ప్రభుక్వం నిండా ముంచుతుందని, రెండో పీఆర్సీ నివేదిక తెప్పించుకోకుండా, అమలు చేయకుండా గత బీఆర్ఎస్, నేటి కాంగ్రెస్ ఉద్యోగులను దారుణంగా మోసం చేసిందన్నారు. ఉద్యోగులకు 5 డీఏ ఇవ్వకుండా తాత్సారం చేస్తోందన్నారు. 2023 మార్చి నుండి రిటైర్ అయిన ఉపాధ్యాయుల, ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలు ఇప్పటివరకు ఏ ఒక్కరికి కూడా అందించలేదన్నారు. చివరకు ఉపాధ్యాయులు, ఉద్యోగులు జీపీఎఫ్ లో తాము దాచుకున్న సొమ్మును, కూడా ఇవ్వకుండా నెలల తరబడి సతాయిస్తూ వాళ్ల ఉసురు తీస్తోందని మండిపడ్డారు.

ఉద్యోగులు తమ ఆరోగ్యం దృష్ట్యానో ,కుటుంబ అవసరాల దృష్ట్యానో ,పిల్లల పెళ్లిళ్ల కోసమో జిపిఎఫ్ లో దాచుకున్న వారి డబ్బులను వారే విత్ డ్రా చేసుకుందాం అంటే చెల్లించలేని అసమర్థత స్థితిలో ఉన్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. విద్యా వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమైపోయిందంటూ రెగ్యులర్ ఎంఈఓలు, డిప్యూటీఈవోలు, రెగ్యులర్ డిఇవోలు లేక పర్యవేక్షణ లేక పాఠశాలలు దారుణంగా తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమీక్షలు లేవు. చదువు లేదు... అజమాయిషీ లేదు.. స్కూళ్లలో చాక్ పీసులకు పైసల్లేవ్... టాయిలెట్లు డగడానికి స్కావెంజర్లు లేరు... ఆఖరికి విద్యాశాఖకు మంత్రి కూడా లేరు. అట్లాంటి పార్టీకి ఓటెందుకు వేయాలన్నారు.

కుల గణన పేరుతో బీసీ జనాభాను తగ్గించే కుట్రకు కాంగ్రెస్ పార్టీ తెరతీసిందని, కేసీఆర్ సర్కార్ చేసిన సర్వేలో 51 శాతం బీసీల జనాభా ఉంటే, రేవంత్ కుల గణన సర్వేలో 46 శాతానికి ఎట్లా పడిపోయిందన్నారు. ఎన్నికల సంఘం రాష్ట్రంలో 3.35 కోట్ల మంది ఓటర్లున్నారని చెబుతోంది. రేవంత్ సర్కార్ మాత్రం 3.7 కోట్ల మంది జనాభా మాత్రమే ఉన్నారని చెబుతోంది. మేధావులు, గణాంకాలు మాత్రం రాష్ట్ర జనాభా 4.3 కోట్లుందని అంటున్నారు. ఈ లెక్కన 60 లక్షల మంది ఎటుపోయినట్లు? కాంగ్రెస్ చంపేసిందా? అని అడిగారు పైగా బీసీ జాబితాలో ముస్లింలను ఎట్లా కలుపుతారని మండిపడ్డారు. రాష్ట్రం మొత్తం తమ స్వంత జగీరులా భావిస్తున్నట్లున్నారని, దీన్ని శహించేది లేదన్నారు. అగ్రకులాల ప్రజలు కూడా బీసీలకు జరిగిన అన్యాయంపై సానుభూతి తెలుపుతుంటే, బీసీ సంఘాలు ఎందుకు నోరు మూసుకున్నాయని గద్దించారు. బీసీలతోపాటు హిందువులంతా ఏకమై కాంగ్రెస్ కు గుణపాఠం చెప్పాలన్నారు. కాంగ్రెస్ వచ్చాక మొత్తం వ్యవస్థనే భ్రష్టు పట్టిస్తోందని, విద్యా వ్యవస్థను సర్వనాశనం చేస్తోందని, అర్బన్ నక్సల్స్ చేతిలో తెలంగాణ విద్యా వ్యవస్థ బందీ అయ్యిందన్నారు. విద్యా కమిషన్ లో నక్సల్స్ భావజాలమున్న వాళ్లకు చోటు కల్పించారంటూ ''గన్నుల పాలన కావాలా?.... పెన్నుల పాలన కావాలా?'' ఆలోచించాలని సంజయ్ కోరారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు అన్యాయం చేసిందని, నిధులు కేటాయించాలనే కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. గత 11 ఏళ్లలో కేంద్రం తెలంగాణకు కేటాయించిన నిధులపై బహిరంగ చర్చకు సిద్ధం. అట్లాగే తెలంగాణలోని గ్రామాల్లో తెలంగాణ ప్రభుత్వం ఖర్చు చేస్తున్న నిధులపై చర్చకు సిద్ధమా? శ్వేత పత్రం విడుదల చేసే దమ్ముందా? చెప్పాలన్నారు.

# చత్తీస్‌గఢ్ అడవుల్లో రక్తపుటేరులు

**31 మంది మావోయిస్టులు హతం, ఇద్దరు జవాన్లు వీరమరణం.. మృతుల్లో అగ్రనేతలున్నారా?**

**భద్రతా బలగాల దూకుడు – మావోయిస్టులకు భారీ దెబ్బ.. నక్సలైట్లు కోలుకోలేని సంక్షోభంలోకి జారిపోయారా?**









**భద్రాచలం, మహా:** ఇంద్రావతి నదికొల్లే అడవుల్లో రక్తం ఏరులై పారింది. చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దుల్లో భద్రతా బలగాలు మరోసారి మావోయిస్టులపై భారీ ఎదురుదాడికి దిగాయి. ఆదివారం ఉదయం బీజాపూర్ జిల్లా అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు నక్సలైట్లను చుట్టుముట్టాయి. గంటల పాటు జరిగిన ఎదురుకాల్పుల్లో 31 మంది మావోయిస్టులు మృతి చెందగా, భద్రతా బలగాలకు చెందిన ఇద్దరు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో అగ్రనేతలున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భద్రతా బలగాలు ముందుగా ఖచ్చితమైన సమాచారంతో వ్యూహాత్మకంగా మావోయిస్టు స్థావరాన్ని ముట్టడించాయి. కాల్పులు ప్రారంభమైన క్షణంనుంచే మావోయిస్టులు తీవ్రంగా ప్రతిఘటించేందుకు ప్రయత్నించినా, భద్రతా దళాల ధాటికి తట్టుకోలేకపోయారు. భారీగా ఆయుధ సామగ్రి స్వాధీనం కావడంతో మావోయిస్టు దళాలకు ఇది గట్టి ఎదురుదెబ్బగా మారింది.

**ఇంద్రావతి అడవుల్లో తీవ్ర ఉద్రిక్తత – నక్సలైట్ ప్రాబల్యానికి తీవ్ర దెబ్బ.**

ఇంద్రావతి నేషనల్ పార్క్ ప్రాంతంలో భద్రతా బలగాల కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతున్న క్రమంలో మావోయిస్టుల సమూహం గుట్టుచప్పుడు కాకుండా సమావేశమవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్, స్పెషల్ టాస్క్ ఫోర్స్, మహారాష్ట్ర సి60 కమాండోలు సంయుక్తంగా భారీ దాడికి సిద్ధమయ్యాయి. ఉదయం మొదలైన ఎదురుకాల్పులు గంటలపాటు కొనసాగాయి. తక్కువ సమయంలోనే మావోయిస్టులు బలహీనపడటంతో భద్రతా బలగాలు మరింత ముందుకు సాగాయి. ఎన్‌కౌంటర్ పూర్తయ్యే సమయానికి 31 మంది నక్సలైట్లు మృతి చెందగా, మరి కొందరు తీవ్రంగా గాయపడ్డారు. ఘటన స్థలంలో భారీగా ఆయుధ సామగ్రి స్వాధీనం చేసుకున్నారు.

**స్వాధీనం చేసిన ఆయుధాలు – భారీ కుట్ర అడ్డుకట్ట?.**

ఎన్‌కౌంటర్ అనంతరం భద్రతా బలగాలు మావోయిస్టుల స్థావరాలను తల్లకిందులు చేశాయి. అక్కడ భారీగా తుపాకులు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు.

ఏకే47 తుపాకులు - 12
ఎస్ఎల్ఆర్ తుపాకులు - 6
లైట్ మెషీన్ గన్లు - 3
హ్యాండ్ గ్రెనేడ్లు - 20

**వందల సంఖ్యలో బుల్లెట్లు, పేలుడు పదార్థాలు**

ఈ స్థాయిలో ఆయుధ సామగ్రి లభించడాన్ని భద్రతా వర్గాలు తీవ్రంగా పరిగణిస్తున్నాయి. ఇంత భారీగా ఆయుధాలు నిల్వ ఉండటంతో మావోయిస్టులు పెద్ద దాడికి సిద్ధమవుతున్నారన్న అనుమానాలు కలుగుతున్నాయి. తెలుగు రాష్ట్రాలకు చెందిన మావోయిస్టు అగ్రనేతల మృతి అనుమానాస్పదం. బీజాపూర్ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టుల కీలక నేతలు మృతి చెందినట్లు సమాచారం. మృతుల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన మావోయిస్టు అగ్రనేతలు ఉన్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతదేహాల గుర్తింపు ప్రక్రియ పూర్తయిన తర్వాత దీనిపై భద్రతా బలగాలు అధికారిక ప్రకటన చేయనున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో మావోయిస్టు ప్రభావం గత కొంతకాలంగా తగ్గినా, కీలక నేతలు చత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర అడవుల్లో సక్రియంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. వారి మృతితో మావోయిస్టు ఉద్యమం మరింత సంక్షోభంలో పడనుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**కేంద్రం మావోయిస్టుల నిర్మూలనకు మరింత కఠినంగా వ్యూహరచన చేయాలా?.**

ఇటీవల వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టు ఉద్యమం తీవ్రంగా దెబ్బతింటోంది. కానీ, ఈ ఆపరేషన్ తర్వాత మిగిలిన మావోయిస్టు నేతలు కొత్త వ్యూహంతో తిరిగి పునరుద్ధరించుకునే అవకాశముందా? లేక భద్రతా బలగాల నిరంతర దాడులతో వారు పూర్తిగా బలహీనపడతారా? అనే ప్రశ్నలు నెలకొన్నాయి. కేంద్ర ప్రభుత్వం భద్రతా బలగాలకు మరింత సహాయం అందించాలని పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రత్యేకించి, నక్సలైట్ ప్రభావిత రాష్ట్రాల్లో మరింత కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ పెరుగుతోంది.

### భవిష్యత్తులో మావోయిస్టు ఉద్యమం

**ఈ ఎన్‌కౌంటర్ మావోయిస్టులకు గట్టి హెచ్చరికగా మారిందా? నక్సలైట్ ప్రభావిత రాష్ట్రాల్లో భద్రతా బలగాలు మరింత కఠినంగా వ్యవహరించాల్సిన సమయం వచ్చిందా? వరుస దాడులతో మావోయిస్టు నెట్వర్క్ పూర్తిగా క్షీణించిపోతుందా? భద్రతా బలగాల దూకుడుతో మావోయిస్టు ఉద్యమం సంక్షోభంలో పడిపోయిందనడంలో సందేహం లేదు. కానీ, భవిష్యత్తులో వారి ప్రణాళికలు ఏమిటి? మిగిలిన నక్సలైట్ దళాలు మరోసారి రీ గ్రూప్ అవుతాయా? లేక భద్రతా దళాల ఒత్తిడికి తలొగ్గి పూర్తిగా చతికిలపడతారా? అనేదే ఇప్పుడు ప్రధాన చర్చాంశంగా మారింది.**

# కేటిఆర్ వ్యాఖ్యలను బీసీ సమాజం క్షమించదు

**టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఫైర్**

కులగణన దేశానికే ఆదర్శం

సర్వేలో పాల్గొనని కేటీఆర్ రీసర్వే గురించి మాట్లాడడం విడ్డూరం





**హైదరాబాద్, మహా:** కులగణన సర్వేపై కేటీఆర్ వ్యాఖ్యలను బీసీ సమాజం క్షమించదని , తెలంగాణలో కులగణన సర్వే పారదర్శకంగా జరిగిందని, కేటీఆర్ ఎలాంటి ఆధారాలు లేకుండా బిసి కులగణనను తప్పులు తడక అంటున్నారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఫైరయ్యారు. ఎంతో శాస్త్రీయంగా లక్షకు పైన సిబ్బందిని పెట్టి ఇల్లిల్లు పరిశీలన చేసి గణన చేయడం జరిగిందన్నారు. కులగణన దేశానికే ఆదర్శంగా చేపట్టామని, కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంటే భరించలేక కేటీఆర్ ఏదేదో మాట్లాడుతున్నారన్నారు. రాహుల్ గాంధీ ఆదేశాలనుసారం కులగణన సర్వేను కాంగ్రెస్ ప్రభుత్వం సంకల్పంతో పూర్తి చేసిందన్నారు. 1931 తర్వాత కులగణన జరిగిందని, ఇది బీసీ లకు ఎంతో మేలు చేసిందన్నారు. పక్కాగా పకడ్బందీగా కులగణన ను దేశంలోనే మొదటిసారి చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. 2014 లో సమగ్ర కుటుంబ సర్వే చేసి కనీసం ఆ లెక్కలను కూడా బయటకు చెప్పలేని అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పుడు మాట్లాడడం అవివేకమన్నారు. బీసీలకు న్యాయం జరుగుతుంటే కేటీఆర్ భరించలేక పోతున్నారన్నారు. కులగణన సర్వేలో పాల్గొనని కేటీఆర్, ఆయన కుటుంబ సభ్యులు రీ సర్వే గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. బలహీనవర్గాల గురించి కేటీఆర్ మాట్లాడటం హాస్యాస్పదమని, పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో బీసీలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ బీజేపీ లోపాయికారి ఒప్పందం చేసుకున్నాయని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేయడానికి బిఆర్ఎస్ పార్టీకి అభ్యర్థులు కరువయ్యారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మాదిరిగానే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పరోక్షంగా బీజేపీకి బిఆర్ఎస్ మద్దతునిస్తున్నదని మండిపడ్డారు.

# టిఫిన్ చేసి వచ్చేలోపు రూ.23 లక్షలు మాయం

- ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో చోరీ
- నార్కట్‌పల్లి పూజిత హోటల్ వద్ద సంఘటన

**నల్గొండ, మహా:** బస్సు దిగి టిఫిన్ చేసి వచ్చేలోపు రూ.23 లక్షలు ఉన్న బ్యాగును దుండగులు దొంగలించారు. ఈ ఘటన నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం గోపాలపల్లి శివారులోని జాతీయ రహదారిపై ఉన్న పూజిత హోటల్ వద్ద జరిగింది. ఈ చోరీపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం, బాపట్లకు చెందిన వెంకటేశ్ అనే యువకుడు రూ.23 లక్షలతో చెన్నై నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ప్రైవేటు ట్రావెల్స్ బస్సును ఎక్కి ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో ఉదయం 9 గంటల సమయంలో నార్కట్‌పల్లి శివారులోని పూజిత హోటల్ వద్ద టిఫిన్ చేయడానికి బస్సు ఆపడంతో అందరితో పాటు వెంకటేశ్ కూడా దిగాడు. అయితే రూ.23 లక్షలు ఉన్న బ్యాగును బస్సులో ఉంచి హోటల్‌లోకి వెళ్లి టిఫిన్ చేసి వచ్చి బస్సులో చూడగా డబ్బులు ఉన్న బ్యాగు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రూ.23 లక్షలు ఉన్న బ్యాగును బస్సులో వదిలేసి, అంత నిర్లక్ష్యంగా టిఫిన్ చేయడానికి ఎలా వెళ్తాడని బాధితునిపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అక్కడి సీసీ ఫుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నారు.



# కులగణన తప్పులతడక

**రీసర్వే చేయాలని కేటీఆర్ డిమాండ్**

**హైదరాబాద్, మహా :** కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన తప్పులతడక అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. బీసీలకు అన్యాయం చేయకుండా.. రీసర్వే చేయాలని ప్రభుత్వాన్ని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో బీసీ నేతలతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ జనాభాను తగ్గించి చూపెట్టి, బలహీన వర్గాలను తక్కువ చేసి చూపిస్తున్నారని, నెల రోజుల పాటు శాస్త్రీయంగా రీ సర్వే చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. బీసీ సెల్ అధ్యక్షుడు ముఠా గోపాల్ అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం జరిగింది. బీసీలకు క్షమాపణ చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లు తీసుకురావాలని సీఎంని కేటీఆర్ డిమాండ్ చేశారు. సమావేశంలో మధుసూధనాచారి, గంగుల కమలాకర్, శ్రీనివాసగౌడ్, జోగురామన్న, బండప్రకాష్, వద్దిరాజు రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# టోలీచౌకీలో కాల్పుల కలకలం?

**రియల్టర్ ఇంటి వద్ద ఘర్షణ**

- కాల్పులు జరిపినట్లు ఆధారాలు లభించలేదన్న పోలీసులు
- ఎవరూ ఫిర్యాదు చేయలేదటున్న పోలీసులు
- విచారణ జరిపుతున్నామన్న సీఐ



**మహా :** భూ వివాదానికి సంబంధించి హైదరాబాద్ టోలిచౌకీలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ తీవ్ర కలకలం రేపింది. గోల్కొండకు చెందిన షకీల్ శనివారం రాత్రి కొంతమంది వ్యక్తులతో కలిసి టోలిచౌకీలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే అక్తర్ ఇంటికి వెళ్లి గొడవపడినట్లు తెలుస్తోంది. ఈ సమాచారం తెలియడంతో హుమాయూన్ నగర్ పోలీసు స్టేషన్ అధికారి బాలకృష్ణ సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో కాల్పులు జరిగాయన్న సమాచారంతో అక్తర్ వద్ద ఉన్న లైసెన్సు గల తుపాకీని పోలీసులు తనిఖీ చేశారు. కాల్పులు జరిపినట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదని పోలీస్ అధికారి బాలకృష్ణ తెలిపారు. అయితే ఇరువర్గాల్లో ఎవరూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదని ఆయన చెప్పారు. జరిగిన ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపడతామని, దీనిని సుమోటోగా తీసుకుని ఘర్షణలో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. భూ వివాదం నేపథ్యంలో జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.



# ఆప్ ఇక క్లోజ్


**మొదటి మెట్టు పడింది**

- కేజ్రీవాల్‌ను ఏకి పారేసిన ప్రశాంత్
- సహజత్వం కోల్పోవడంతోనే ఈ గతి అని పోస్ట్

**మహా :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఘోర ఓటమికి అరవింద్ కేజ్రీవాల్ కారణమని, ఇది పార్టీ ముగింపునకు ఆరంభం అని ఆ పార్టీ మాజీ నేత ప్రశాంత్ భూషణ్ ఏ ఉద్దేశంతో పార్టీ పెట్టారో ఆ పార్టీ మూల సిద్ధాంతాలకు కేజ్రీవాల్ తిలోదకాలు ఇచ్చారని, అవినీతి సంస్థగా పార్టీని మార్చారని దుయ్యబట్టారు. ఢిల్లీ రాజకీయాల్లో ప్రత్యామ్నాయ శక్తిగా వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీ ఇందుకు భిన్నంగా పారదర్శకతతో పాలించడంలో విఫలమైందన్నారు. 2015లో ప్రశాంత్ భూషణ్‌ను పార్టీ నుంచి 'ఆప్' బహిష్కరించింది. ''ఆమ్ ఆద్మీ పార్టీ సహజ స్వభావాన్ని కోల్పోయింది. ప్రత్యామ్నాయ రాజకీయాల పేరుతో పార్టీ స్థాపించింది. ప్రజాస్వామ్యబద్ధంగా, పారదర్శకతతో పాలించడంలో పూర్తిగా విఫలమైంది. లోక్‌పాల్ సిద్ధాంతాలతో రాజకీయ ప్రవేశం చేసి ఇప్పుడు సొంత లోక్‌పాల్‌ను సృష్టించుకుంది. అవినీతి పార్టీగా ముద్రవేయించుకుంది" అని ప్రశాంత్ భూషణ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో విమర్శించారు. కేజ్రీవాల్ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి 'శీష్‌మహల్' కట్టుకున్నారంటూ చెలరేగిన వివాదాన్ని ప్రశాంత్ భూషణ్ ప్రస్తావిస్తూ, ఎన్నికల్లో ఇది ప్రధాన ప్రచార అస్త్రంగా మారిందన్నారు. ''ఆయన తన కోసం రూ.45 కోట్లతో శీష్ మహల్ కట్టుకున్నారు. లగ్జరీ కార్లలో తిరగడం మొదలుపెట్టారు. ఆప్ ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ సూచించిన 33 సమగ్ర పాలసీ నివేదికలను చెత్తబుట్టలో పడేశారు'' అని భూషణ్ ఆరోపించారు. చిత్తశుద్ధితో పాలన అందించడానికి బదులుగా ప్రచారార్భాటాలకు పరిమితమయ్యారని అన్నారు. ఇది ఆప్ ముగింపునకు ప్రారంభమని ఘాటు వ్యాఖ్యలు చేశారు. శనివారం ప్రకటించిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఆప్ గత అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన 62 స్థానాల నుంచి 22 స్థానాలకు పడిపోయింది. అప్పట్లో 8 సీట్లు మాత్రమే గెలిచిన బీజేపీ 48 సీట్లు గెలుచుకుని విజయకేతనం ఎగురవేసింది. కేజ్రీవాల్ సహా ఆప్ కీలక నేతలు పలువురు చిత్తుగా ఓడిపోయారు.


# 2026 మార్చి 31 నాటికి నక్సలిజం నుంచి విముక్తి

- ఎన్ కౌంటర్ ఘటనపై సామాజిక మాధ్యమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా
- జవాన్లను అభినందించిన హోం మంత్రి



**మహా :** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు 31 మంది మావోయిస్టులను మట్టుబెట్టిన ఘటనపై కేంద్ర మంత్రి అమిత్ షా సామాజిక మాధ్యమంలో స్పందించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర చరిత్రలోనే రెండో భారీ ఎన్‌కౌంటర్‌గా దీనిని చెబుతున్న నేపథ్యంలో భద్రతా బలగాల భారీ సక్సెస్‌పై అమిత్‌షా అభినందించారు. ''నక్సలైట్ల నుంచి దేశానికి విముక్తి కలిగించే దిశగా బిజాపూర్‌లో భద్రతా బలగాలు భారీ సక్సెస్ సాధించారు. ఈ ఆపరేషన్‌లో 31 మంది నక్సల్‌స్‌ను బలగాలు మట్టుబెట్టాయి. భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు'' అని అమిత్‌షా పేర్కొన్నారు. నక్సలిజం అంతానికి చేపట్టిన ఈ ఆపరేషన్‌లో ఇద్దరు సాహస జవాన్లు ప్రాణాలు కోల్పోయారనీ, దేశం కోసం ప్రాణాలర్పించిన ఈ త్యాగధనులను దేశం మరువదని చెప్పారు. జవాన్ల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, నక్సలిజం కారణంగా ఒక్క పౌరుడు కూడా ప్రాణాలు కోల్పోరాదన్నారు.





- దర్భశయనం
శ్రీనివాసాచార్య
94404 19039

# మిరప కళ్ళం

ఆకుపచ్చ వర్ణంతో జన్మెత్తి
తల్లి చాటు బిడ్డల్లా ఒదిగిన కాయలు
ఎరుపుగా ఏపుగా ఎదిగిపండ్లయి
కూలీ పనికి దిగిన తల్లుల చేతులేరితే
మళ్ల నుంచి ఈ కళ్ళానికి చేరి ఆరుతున్నాయి
ఆరుబయట ఎర్రటి ఎండలో-
ఇపుడీ మిరప కళ్ళం నేలతల్లిని
సత్కరిస్తున్న ఎరుపు తివాచీ-

నేల రంగూ చెమట రంగూ మొక్క రంగూ
మేళవిస్తే జీవం నిండిన పండు ఎరుపు రంగు అని ఈ కళ్ళం
కొత్త రసాయన శాస్త్ర పాఠాన్ని చెబుతున్నట్లుగా వుంది

ఒక అరుణారుణ సైనిక దళం సేద దీరుతున్న
దట్టమైన శిబిరం లాగా వుంది
ఈ ఘాటు కళ్ళం

మెత్తదనపు నిశ్శబ్దంతో ఇక్కడ చేరిన మిరప్పండ్లు
సూర్యుడి కిరణ శ్లోకాలను వింటూ వింటూ
గల గలలను వొంట పట్టించుకున్నాక
ఇక్కడి నుంచి వెళ్ళాలి బరువు బరువుగా!

అయినా లేచి మళ్లను దాటుకుంటూ
రైతుల భుజాల మీదుగా కళ్ళమే
ఎందుకెళ్లాలి దూరపు అంగళ్లకు ?

దేశమే పల్లెల బాటల మీదుగా నడిచి ఇక్కడికొచ్చి
బతుకు దినుసును పండించిన చేతులకుసొమ్మును
సకాలంలో సగౌరవంగాసవ్యంగా సమర్పించి
కళ్ళానికి మొకరిల్లి మిరపసిరిని మహా ప్రసాదంగా
స్వీకరించి వెళ్ళాలి కదా!

దేశమా ! వస్తున్నావా ?


చూడడానికి కళ్ళం దండిగా రక్తవర్ణంతో జవసత్తువతో
సొబగుతో మెరుస్తూ వుంటుంది మట్టి కాంతితో -
మరవొద్దు, దానిదెపుడూ పండించిన చేతుల పక్షమే -
ఆ చేతులకు దక్కాల్సిన రొక్కం దక్కక పోతే
అది మరింత ఘాటెక్కి భగ్గు భగ్గున మండగలదు కూడా!

దేశమా ! వింటున్నావా ?

# ఒక పువ్వు వికసించే వేళ...



అదేంటో గాని
ఓటమి కూడా గెలుపు లాగే కనిపిస్తుంది
అర్ధరాత్రి పాము పడగ మీదచుక్కల మణులు
మనిషి జీవితాన్ని నిర్వచిస్తుంటాయి
ఎగిరిపోయిన హంసలైతే
అసలు తిరిగి రావు
తిరిగిరాని తీరం జ్ఞాపకాలతో
మరొక మజిలీ కోసం నడక సాగాల్సిందే
ఎవరి దుఃఖం వారిదే
ఎంత దాచుకున్నా నల్లటి చీకటిని ముఖం
ప్రదర్శిస్తూనే ఉంటుంది
మొగ్గలు గానే వాడిపోయిన
బతుకులకు ఎవరు మాత్రం కొత్త జీవితం
అందించగలరు?
అక్షరాలుగా ఉదయించవలసిన
హృదయాలు ముక్కలైపోతే
ఇంకా నూతనత్వానికి స్థానం ఏది?
అయినా.... చీకటి ఎప్పుడూ గమ్యం కాదు.
దుఃఖం మాత్రమే జీవితమూ కాదు.
అటు చూస్తే తెలుస్తుంది
అడవిలో నిశ్శబ్దంగా ఒక పువ్వు వికసిస్తో....



డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన్ రాజు
9676096614

# పేరు లేని దయ్యం !

కథ





- సామాన్య

ఆదివారం మధ్యాన్నం పూట మాంసం కూర తో అన్నం తిని రెండో సారి పేపర్ తిరగేసి పదే పదే చేతిలోని ఫోన్ లో టైం చూసుకుంటూ "రెండుకంతా వస్తానని చెప్పి ఇప్పటికి అరగంట అయింది మనుషులకి ఒక పద్ధతి పాడూ లేదు "అన్నాడు చరణ్ ."మంచు కాలం ,పొడవైన రాత్రులు ,చీకటి పడే దాక బయట ఉండటం ఎందుకు .." అదీ అతని ఆలోచన . అటూ ఇటూ తిరుగుతూ ఏదో పని చేసుకుంటున్న అతని భార్య,అతను అన్నది విని "వచ్చేస్తా వుంటారులే వాళ్ళకెన్ని పనులో " అంది .ఆవిడ అలా అందో లేదో బయట కారు హారన్ మ్రోగింది . చరణ్ గబగబా లేచి, వెళ్ళొస్తానని భార్యకు చెప్పి ,బయటకి వచ్చి కారు ఎక్కాడు . కారు మృదువుగా ముందుకు కదిలింది . చరణ్ సాఫ్ట్వేర్ ఇంజనీర్ . వున్న వూర్లో పొలము పుట్రా వున్న వ్యక్తి . పైగా పొదుపరి . అందుచేత అతను డబ్బులు బాగా కూడ పెడుతూ అక్కడా ఇక్కడా చవకలో వచ్చే స్థలాలు కొంటూ ఉంటాడు . ఇవాళ కూడా రియల్ ఎస్టేటు ఏజెంట్లతో పట్టణానికి పదిహేను కిలోమీటర్ల దూరంలో వున్న పల్లెటూరుకు బయలుదేరాడు . పదిహేను కిలోమీటర్లు అంటే ఎంత దూరమని కళ్ళు మూసి తెరిచే లోపు టౌన్ లో కలిసి పోతుంది ఈ రోజు లక్షలలో కొంటె ,రేపు పిల్లలు కోట్లలో అమ్ముకోవచ్చు ... అదీ అతని ఆలోచన .

కారు టౌన్ దాటి మలుపు తీసుకుని పల్లె దారి పట్టగానే రోడ్డు మీద వాహనాలు పలుచబడి పోయాయి .మంచి తారు రోడ్డు ఎండకి మిల మిలా మెరుస్తూ వుంది . అప్పుడప్పుడూ రోడ్డు మీద నీటి చెలమల్లా నీటి నీడ కనిపిస్తూ వుంది . వాటినే ఎండమావులు అంటారని చరణ్ కి తెలుసు . కారు ఒక చోట మలుపు తీసుకుంది . అక్కడ నుండి రోడ్డు ఇరువైపులా రకరకాల ముళ్ళ చెట్లు పిచ్చి తీగలు నిండి ఆ ప్రాంతానికి ఒకలాంటి నిశ్శబ్దాన్ని ఆపాదిస్తూ వుంది. హఠాత్తుగా ఆ మలుపు దారి నుండి కాలం చాలా చిన్నగా నడుస్తుందేమో అన్న భ్రాంతి కలుగుతుంది . మలుపు తిరిగాక ఒక పది నిమిషాలకి, కారు ,చదును చేసి యెల్ల రాళ్లు పాతి వున్న ఒక స్థలం దగ్గర ఆగింది . కనిపించినంత దూరం నలు చదరం చేసి, ఎల్లలు వేసిన భూమి . రోడ్డు దిగగానే ఎదురుగా చోట "ప్రణతి లే అవుట్ " అనే బోర్డు . అక్కడే ఒక చిన్న ఆఫీస్ కనిపించాయి . చరణ్ ను బ్రోకర్లు కాసేపు ఆ ఆఫీస్ లో కూర్చో పెట్టి లే ఔట్ లో ఖాళీ వున్నస్థలాలను బ్రోషర్ మీద చూపించారు . చరణ్ లే ఔట్ బ్రోషర్ ను క్షున్నంగా చూసి వాళ్ళు చెప్పింది విని ,తూర్పు వాకిలి వచ్చే ఒక ప్లాట్ ను ఎంపిక చేశాడు . టీ తాగాకఅందరూ ఆ స్థలాన్ని చూడటానికి బయలుదేరారు . సాధారణంగా రియల్ ఎస్టేట్ వాళ్ళు లేఔట్ వేసేప్పుడు అడ్డొచ్చిన చెట్టు చేమలు బుల్డోజర్ తో పెళ్లగించి మిట్ట పల్లాలను చదును చేసి ఇల్లు కట్టు కోవడానికి అనుకూలం చేస్తారు . కానీ చరణ్ చూడటానికి వచ్చిన ప్లాట్ లో ,మొత్తం స్థలమంతా ఆక్రమించుకుని పెద్ద చింత చెట్టు వుంది . చరణ్ వెంటనే పక్కనున్న బ్రోకర్ ని అడిగాడు ఆశర్యం గా " ఈ చెట్టు తీసేయలేదేం " అని . బ్రోకర్ కనుబొమలు పైకెత్తి " ఓ అదా! "అని " దాని కిందే ఆఫీసు కడదామని అనుకున్నారు చల్లగా ఉంటుంది కదా అని ,మళ్ళీ ఎందుకో వేరే దగ్గర కట్టారు . అయినా మీరు ఇల్లు కట్టేటప్పుడు చెట్టు కొట్టేసి కట్టెను అమ్ముకోండి ,వచ్చే డబ్బుకు మీ ప్రహరీ గోడ కట్టుబడి అయిపోతుంది" అన్నాడు .ఆ మాట విని చరణ్ మొహం చిట్లించి " ఆ చెట్టును కూకటి వేళ్ళతో తవ్వి తీసేసరికి తడిసి మోపెడవుతుంది . ప్రహరీ గోడ సంగతి దేవుడెరుగు " అన్నాడు . ఆ ప్లాటుకు ఆనుకుని వున్న మరో రెండు ప్లాట్లు చూసి ఇంటికెళ్లి భార్యతో మాట్లాడి ఏ విషయం చెప్తాను అన్నాడు చరణ్ , ఇక బయలుదేరదామని కారెక్కేటప్పుడు చరణ్ అసంతృప్తి కనిపెట్టిన బ్రోకర్ "అన్నా !సార్ కు దేవాలయాన్ని ఆనుకుని వుండే ప్లాట్లు కూడా చూపిద్దాం అవి కూడా ఖాళీనే కదా " అన్నాడు తన పక్కనున్న బ్రోకర్ తో . అందరు కలిసి లేఔట్ చివరనున్న దేవాలయం దగ్గిరికి బయలు దేరారు

రెండు ప్లాట్లు చూడడం అయ్యాక పక్కనే ఉన్న శివాలయంలోకి వెళ్ళాడు చరణ్. ఈ మధ్యనే వచ్చిన ఏ పండుగకో కొత్తగా సున్నం వేసినట్లు ఉన్న ఆ శివాలయంలో నిశ్శబ్దం తాండవిస్తూ వుంది . అప్పుడప్పుడు ధ్వజస్తంభం గంటలు మృదువుగా గణగణ లాడుతున్నాయి. గుడి గోపురం లో గూళ్ళు పెట్టుకొని ఉన్న పావురాలు ఉండుండి గూగు గూగు అని శబ్దం చేస్తున్నాయి . మందిరం లోపల ఇనుప కమ్ముల తలుపు అవతల ఈ ప్రపంచంతో తనకేమీ పని లేనట్లు నిరామయంగా ఉంది శివుని లింగం.ఆ ప్రశాంతతకు అక్కడ నిజంగా శివుడు తపస్సు చేసుకుంటున్నాడేమో అనిపించి చరణ్ కి ఒక్క క్షణం వళ్ళు గగుర్పొడిచింది . దేవునికి నమస్కారం చేసి గుడిలోంచి బయటకు వచ్చి చెప్పులు వేసుకున్నాడు . అతన్ని చూసి కారు టర్నింగ్ తీసుకోవాలనుకున్న డ్రైవరు ,టర్నింగ్ తీసుకుంటూ కారు టైర్లని దేని మీదకి ఎక్కించాడో కానీ కారు టైరు పెద్ద శబ్దంతో పంక్చర్ అయింది. కారులో ఉన్నవాళ్లు గబగబా దిగి ,టైర్ దగ్గరికి వచ్చి తొంగి చూస్తున్నారు ,వారి ఆతృతను గ్రహించిన డ్రైవర్ నింపాదిగా ఆ కారుకి స్టెప్నీ లేదని ప్రకటించాడు. అక్కడే వుండి ఇదంతా చూస్తూ ఉన్న మేకల కాపరి ఒకతను వీరి దగ్గరికి వచ్చి కారుకి పంచర్ వేయాలంటే ఊళ్లోకి వెళ్లాల్సిందే అన్నాడు.వెళ్లినా పంక్చర్ వేసే వాడు ఈ సమయంలో ఉంటాడో లేదో అని కూడా అన్నాడు . కారు డ్రైవరు ,బ్రోకరు టైర్ ని నెట్టుకుంటూ ఊరి లోపలికి వెళ్లి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని అనుకున్నారు. ఇంకొక బ్రోకర్ మాత్రం చరణ్ బాధ్యత స్వీకరించి తనకి ఆ ఊర్లో తెలిసిన వాళ్లు ఉన్నారని కాసేపు అక్కడ తల దాచుకొని, కాసిని టీ నీళ్లు తాగి వచ్చే బస్సు నో ,ఆటోనో పట్టుకుందామని అన్నాడు. చరణ్ ఆ ఆలోచనకి తన అభ్యంతరం చెప్పి గుడి ముందున్న అరుగుపైన కూర్చుండిపోయాడు. బ్రోకర్ మరి ఏం మాట్లాడకుండా ఊర్లోకి వెళ్లిపోయాడు.

గుడి పక్కన చదును చేసిన లేఔట్ అంతటా తివాచీ లాగ పచ్చటి గడ్డి పరుచుకుని వుంది . ఒక ఏడెనిమిది మేకలు ఆ పచ్చికను ఆనందంతో మేస్తూ వున్నాయి . ఇందాక పంక్చర్ గురించి చెప్పిన పెద్దాయన కర్ర చేత పట్టుకుని వాటిని మేపుతున్నాడు . బ్రోకర్ వెళ్ళిపోయిన తర్వాత చరణ్ తన వైపే చూస్తున్న ఆ పెద్దాయనను " టౌనుకు వెళ్లే బస్సు ఎంత సేపట్లో రావచ్చని "అడిగాడు. అతను చరణ్ మాట విని తలెత్తి ఆకాశం వంక చూసి "బస్సయితే ఇంకో గంట పట్టొచ్చు,అదృష్టం బాగుంటే బాగుంటే అయిదు నిమిషాల్లో ఆటో చిక్కచ్చు " అన్నాడు .చరణ్ మేకల తాత లాగే తలెత్తి ఆకాశం వంక చూసి, ఆ పై తన మొబైల్ వంక చూసుకున్నాడు . సమయం నాలుగు కావస్తుంది అంటే ఐదు గంటలకి బస్సు రావచ్చు. చరణ్ తన మొబైల్ లో ఏమేం చూస్తూ సమయం వెళ్ళ మార్చవచ్చో వెతకడం మొదలు పెట్టాడు . అతను మొబైల్ కి ,ఇంటర్నెట్ కి అలవాటు పడి లేడు . అందుచేత అతనికి కాసేపు ఏం చేయాలో తోచలేదు . తన భార్య అంతంత సేపు మొబైల్లో ఏం చూస్తుందోనని ఆశ్చర్యపడ్డాడు . మేకలలో ఒకటి రెండిటికి మెడలో గంటలు కట్టినట్టున్నారు అప్పుడప్పుడు అవి గణ గణ మని శబ్దాలు చేస్తున్నాయి. తాత కర్ర తాటించి మేకలని అదిలించి వచ్చి చరణ్ పక్కనే కూర్చున్నాడు.

మేకల తాత కమిలిన ఇత్తడి చెంబు రంగులో,అకాలంలో వచ్చిన ముడతల ముఖంతో,వికాసమైన కళ్ళతో బక్క పలుచగా ఉన్నాడు.అతను ఒకసారి మేకల్ని అదిలించి ,తన ఉత్సాహం నిండిన కళ్ళతో చరణ్ వంక చూస్తూ "స్థలం కొనడానికి వచ్చా వా" అని పరిశుభ్రమైన ఏక వచనంలో అడిగాడు. చరణ్ అతని వంక చూడకుండా తలెత్తకుండానే పొడిగా "ఆ !"అని బదులిచ్చాడు. చరణ్ ముక్తసరిని తాత పట్టించుకోలేదు.చాలా వివరాలు అవసరం ఉన్న మనిషిలా "ఏ దిక్కున కొంటున్నావు "అని అడిగాడు. చరణ్ ఓపిక లేని మనిషి కాదు అందుకే బండి పంక్చరయినా విసుక్కోకుండా అక్కడ కూర్చున్నాడు. అందుకే అదే ఓపికతో తాతవంక చూస్తూ "ఆ పెద్ద చింత చెట్టు ఉంది చూడండి అది కొనబోతున్నాను "అన్నాడు.

**చరణ్ చెప్పిన జవాబు ఊహించ నట్టు ఉలిక్కిపడ్డాడు మేకల తాత"అయితే ఈ బ్రోకరు నా కొడుకులు ఆ చింత చెట్టు కథ చెప్పలేదా నీకు" అన్నాడు. ఈసారి తాత చరణ్ దృష్టిని మొత్తం తన వైపు తిప్పకోగలిగాడు . చరణ్ ఒళ్లంతా చెవులు చేసుకుని"ఏం కథ తాత అది"అని అడిగాడు. ఈసారి తాత లేచి నిలబడి"ఉండు చెప్తా"అని దూరంగా ఉన్న మేకలని తన కనుచూపు మేరలోకి తోలుకొచ్చి చరణ్ పక్కన కూర్చుని"వినైతే చెప్తా, ఆ చింత చెట్టు మీద దెయ్యముండ్ల"అన్నాడు. ఈసారి చరణ్ కళ్ళల్లో ఆసక్తి ఇంకొంచెం ఎక్కువైంది. అతనికి చిన్నప్పటినుండి దయ్యం కథలంటే చాలా ఇష్టం.**

తాత ముఖం మేకల వంక తిప్పి చరణ్ వంక మధ్య మధ్యలో మేకల వంకచూస్తూ కథ చెప్పడం మొదలు పెట్టాడు ."మా అవ్వ కాలం నాటి కథ ఇది. ఇప్పుడు రావటం లేదు కానీ ఆ కాలంలో కోతలు కోసిన తర్వాత చేలలోకి బాతులు వదిలే వారు. బాతు పెంట చేలకి ఎరువు ,పరిగ గింజలు బాతులకు మేత . వంద ,రెండు వందలు చొప్పున బాతుల్ని తోలుకొంటూ మనుషులు వచ్చేవారు. చేలలోనే డేరాలు వేసుకుని బాతుల్ని మేపి, అవి గుడ్లు పెడితే వాటిలో సగం గుడ్లని చేను గల్ల ఆసామికి ఇచ్చే వారు. బాతుల్ని తోలిన చేలో పరిగ గింజలు అయిపోతే ఆ బాతుల్ని తీసుకొని ఇంకొక చోటికి వెళ్లేవారు. అలా మా ఊరికి అప్పుడు ఇద్దరు సుగాలి మొగుడు పెళ్ళాలు బాతుల్ని తీసుకుని వచ్చారు. సుగాలోళ్లు అంటే తెలుసు కదా నీకు, ఆడోళ్ళు చెవులకి పెద్ద పెద్ద కమ్మలు చేతులుకి పెద్ద పెద్ద గాజులు వేసుకుంటారు ఎర్రటి గుడ్డలు కట్టుకుంటారు. మా ఊరికి బాతుల్ని తోలుకొచ్చిన జతలో ఆడమనిషి జతగాడి కంటే నాలుగేళ్లు పెద్దది. చెప్పటం ఏమిటంటే చాలా పెద్ద అందకత్తె. బాగా తెలుపు మనిషి. పెద్ద పెద్ద కళ్ళు, బాగా ఎత్తరి. అబ్బాయి సామాన్యమైన మనిషి ఎందులోనూ ఆమెకి జతగాడు కాదు. బక్క పల్చగా పెద్ద కళ్ళతో అమాయకంగా ఉండేవాడు.

**ఒకసారి ఏమైందంటే ఈ ఆడ మనిషి , నదిలో ఆ ఎర్ర పావడ బాగా గుంజుకొని ఆరబెట్టి వేసుకుని ,తలారా స్నానం పోసుకుని, దీపాలు పెట్టే వేళ కి గుడ్లు తీసుకొని ఆ చేనుగల ఆసామి వెంకట రెడ్డి ఇంటికి యెళ్ళింది. యెళ్లడం దొడ్డి తోవ గుండానె యెళ్ళింది. యెళ్లి వంటింటి గుమ్మం ముందు నిలుచుని ఇంట్లో వాళ్ళని కేకేసింది. అప్పుడే అక్కడ అన్నం తింటున్న వెంకటరెడ్డి చేయి కడుక్కోవడానికి దొడ్డి వాకిట్లోకి వచ్చాడు. చేయి కడుక్కుంటూ మెట్ల కింద నిలబడి తల పైకెత్తి చారడేసి కళ్ళతో తన వంకే చూస్తూ"గుడ్లు తెచ్చానయ్య"అని అన్న ఆ సుగాలమ్మిని చూసి అక్కడికక్కడే మనసు పారేసుకున్నాడు. ఆ అమ్మి గుడ్లు అతని భార్య చేతికి ఇచ్చి ,ఆవిడ పెట్టిన మిగులు సగులు తీసుకొని బయటికి వచ్చేసరికి రెడ్డి పంచలోకి వెళ్లి అక్కడ కూర్చుని ఉన్న తన నమ్మిన బంటుని పిలిచి" రేయ్ ఈ రాత్రికి దాన్ని నా షెడ్డు దగ్గరికి తీసుకురా పో" అని ఆజ్ఞ ఇచ్చాడు**

సుగాలమ్మి మొగుడి కంటే నాలుగేళ్లు పెద్దది అని చెప్పా కదా . అది ఎలాగంటే ఆ అమ్మికి మొదటే ఒక పెళ్లయింది . మొదటి మొగుడు సచ్చిపోయాక ఇంట్లో ఉన్నప్పుడు ఈ రెండో పిల్లోడు ఆ అమ్మి ని చూశాడు. మొదటి చూపులోనే మనసు పారేసుకున్నాడు. మొగుడు పోయిన వాళ్ళని చేసుకోవడం వాళ్ల ఆచారంలో సమ్మతమే కనుక కట్నంగా ఇవ్వాల్సిన ఆవుల్ని దూడల్ని వాళ్ళ నాన్నకి ఇచ్చేసి ఆ అమ్మిని సొంతం చేసేసుకున్నాడు. వాడికి ఆ అమ్మి అంటే ప్రాణం తో సమానం. ఆ అమ్మికి కూడా వాడంటే ప్రాణం . ఇద్దరు ఎప్పుడూ చిలకా గోరింకల్లాగా కువ కువ లాడుతూ ఉండేవారు. అలాంటి ఆడమనిషి దగ్గరికి వచ్చి నిర్లజ్జగా రెడ్డి బంట్రోతు "ఈరోజు రాత్రికి రెడ్డి పక్కన పడుకోమన్నాడు"అని చెప్పేడు . అది విని ఆ అమ్మి కోపంతో మండి పడలేదు చాలా శాంతిగా "అట్టాంటి పనులు నేను చేయనయ్యా. నాకు నా మొగుడు అంటే చానా ఇష్టం"అని మరో మాట వినకుండా చేతి గాజులు కాలి కడియాలు గలగల మంటుండగా అక్కడి నుంచి పరిగెత్తుకుంటూ వెళ్లిపోయింది.

**గసపోసుకుంటూ ఇంటికి వచ్చిన పెళ్ళాన్ని చూసి మొగుడు"చీకట్లో చూసుకుంటూ కాస్త నెమ్మదిగా రావచ్చు కదా" అని అన్నాడు. పెళ్ళాం, మొగుడితో ఊళ్లో తనకి జరిగిన సంగతి చెప్పకోలేదు. ఆ రాత్రంతా కలత నిద్రతో ఎగిరెగిరి పడిందే కానీ మొగుడికి మాత్రం జరిగిన సంగతి చెప్పదలచ లేదు. ఒక వారం అలా జరిగిపోయింది. ఆ పిల్ల ఆ సంగతి మరచి పోబోతు ఉంది. అదే సమయంలో ఆ ఊరికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇంకో ఊర్లో వీధి నాటకాలాడే వాళ్లు వచ్చారు. ఈ ఊరికి వచ్చిన తర్వాత బాతులమ్మికి ఈ ఊర్లో ఒక సావాసగత్తె దొరికింది. ఆ పిల్ల వెంకటేశ్వరి బాతులమ్మిని తనతోనాటకం చూడటానికి రమ్మన్నది. బాతులమ్మి మొగుడ్ని అడిగింది. బాతులమ్మి మొగుడు సంధ్య వాటారుతుండగానే పడక ఎక్కేసే రకం. అందుకే ముద్దు ముద్దుగా గునుస్తూ ' తోడుగా వెంకటేశ్వరి కూడా ఉంది కదా,నువ్వు వెళ్లి వచ్చెయ్ ' అన్నాడు కళ్ళు తూలిపోతుండగా . మొగుడు అన్న ఆ మాటలు విని మొగుడి బుగ్గని ఒకసారి సాగదీసి 'మరైతే నేను లేకుంటే భయపడవు కదా' అని అడిగింది మొగుడ్ని . అడిగిందే కానీ ఆ పిల్లకి బాగా తెలుసు మొగుడు రాత్రి పడుకుంటే పొద్దుటి వరకు పులి వచ్చినా లేవడని.**

నాటకం వదిలే సమయానికి ఎంతో పొద్దు గడిచి పోలేదు. రాత్రి పదీ, పదిన్నర అయుంటుంది . వెంకటేశ్వరి బాతులమ్మి పక్క పక్కన నడుచుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటూ వస్తున్నారు. వాళ్ళముందు వెనకాల కూడా మనుషులు ఉన్నారు. ఆ వస్తున్నప్పుడు చెప్పుకున్న కబుర్లలో భాగంగా బాతులమ్మి వెంకట రెడ్డి తన బంట్రోతు చేత ఏమని అడిగించాడో వివరంగా చెప్పుకున్నది. అటువంటివి మొగుడుకు చెప్పొద్దని వెంకటేశ్వరి పెద్దరికంతో అన్నది. తను చెప్పలేదని బాతులమ్మి ఒప్పుకున్నది. కొంత దూరం నడిచిన తర్వాత బాతులమ్మి వెళ్లే దారి వచ్చింది . రహదారి నుంచి పక్కన ఉన్న చేల మీదుగా వాళ్ల గుడారానికి వెళ్లాల్సి ఉంటుంది. ఆ దారి ఈ గుడిని దాటుకొని వెళ్ళాలి. తనని దాటుకొని వెళుతున్న బాతులమ్మి కి రాబోయే ఆపద ముందే తెలిసినా ఇదిగో ఈ గుడిలో శివుడుండాడే ఆయన నోరు మూసుకుని కూర్చున్నాడు . ఈ గుడి దాటి వెంకటరెడ్డి పంపు షెడ్డు దాటి తన గుడారం కి వెళ్ళాలి. అలా వెళ్తున్న బాతులమ్మి వెంకటరెడ్డి కళ్ళల్లో పడింది. అప్పటికే బాగా తాగి ఉన్న వెంకట రెడ్డి బంట్రోతుతో కలిసి బాతులమ్మని పంపు షెడ్డు పక్కనే ఉన్న తన గదిలోకి లాక్కెళ్ళాడు.చుట్టుపక్కల కూత వేటు దూరంలో ఎవరు ఉండరు బాతులమ్మి అరుపులు తాగి ఉన్న వెంకట రెడ్డికి చాలా సుఖాన్ని ఇచ్చాయి, సుఖాన్ని ఎక్కువ చేశాయి. బాతులమ్మిని చెరిచాక వెంకట రెడ్డి ఆమెని చూస్తూ"నచ్చిందా" అన్నాడు. కళ్ళ నీళ్లు కారిపోతూ ఉండగా కష్టపడి ,లేచి గుడ్డలు సర్దుకుంటున్న ఆమెని చూస్తూ"నచ్చితే అప్పుడప్పుడు వస్తుండు ... ఇక్కడి నుంచి పోయే వరకే లే, పిల్లోడో , పిల్లో పుడితే నా పోలికలతో పుడితే కబురు చెయ్ , పట్టీలో మురుగులో చేయించి పెడతా," అన్నాడు గొంతులో కరుణ కారిపోతుండగా.

కాళ్లు ఈడ్చుకుంటూ గదిలోంచి బయటికి వచ్చిన బాతులమ్మి ని చూసి వెంకట రెడ్డి పనోడు ,వెంకట రెడ్డి కంటే ఎక్కువ జాలిని గొంతులో నింపుకొని,"అయ్య తినని మాంసం లేదు పావురం కాడి నుంచి ఎలికా, పాము మాంసం దాకా అన్ని తిన్నారు. మంచి మాంసం లేక కాదు ,అయ్యకి అదొక సరదా . నువ్వు కూడా అంతే!, గుట్టుగా బతుకు పో, ఎవరికన్నా చెప్పుకుంటే అయ్యకి పోయేదేం లేదు "అన్నాడు. ఆ గది నుంచి బయటపడిన బాతులమ్మి కాళ్లు ఈడ్చుకుంటూ తమ గుడారం వైపు అడుగు లేసింది . కోత కోసిన పొలాలు , తలలు కోసిన మొండాలు లాగా ఆకాశం వంక చూస్తున్నాయి. ఆకాశమంతా వెన్నెల పట్టపగలులా నిండి ఉంది. చంద్రుని చుట్టూ వలయం లా చంద్రుడి గుడి సొగసులీనుతుంది. ప్రకృతిలో ఎక్కడా ఘోరం జరిగిపోయింది అని గాబరా పడుతున్న దాఖలాలు లేవు . ఎవరూ లేని పొలాల వెంట బాతులమ్మి ఒక్కటే నడిచి వెళ్ళింది . వెళ్ళినంత దూరం రప రప శబ్దం చేస్తూ ఉన్న పావడను కొద్దిగా ఎత్తి పట్టుకొని నిశ్శబ్దంగా అడుగులు వేసింది . చెంపల మీద కళ్లనీళ్లు దారపాతంగా కారుతూ రవికను తడుపుతూ ఉంటే ,ఏడుపును గొంతులోనే అదిమి పెట్టుకుంటూ గుడారం వైపుకి సాగింది.

ఆ రోజు పొద్దున్నే తన పక్కన ఒంటిమీద గాయాలతో రక్కులతో పడుకుని ఉన్న భార్యను చూసి ఆశ్చర్యపడ్డాడు ఆమె భర్త. ఈసారి బాతులమ్మి ఏమి దాచి పెట్టుకోలేదు. ఏడుస్తూ ఎక్కిళ్ళు పెడుతూ అతనికి అంతా చెప్పుకుంది. పల్చని శరీరంతో సొగసైన అవయవాలతో ఉన్న ఆమె భర్త మొదట ఏమి మాట్లాడలేదు. ఆమెతో పాటు మౌనంగా ఏడ్చాడు. ఒకరినొకరు పట్టుకుని ఏడ్చుకున్నారు. ఇద్దరూ గుడారం ఎత్తేసి వెళ్లిపోవాలని నిశ్చయించుకున్నారు కానీ బాతులమ్మి ఒంటి మీద గాయాలు ఆమెను కదలనీయ లేదు. కొంచెం తగ్గుముఖం పట్టే వరకు ఉండాలని అనుకున్నారు. ఆమె గాయాలు ఒక వారంలో చెక్కు కట్టాయి. బాతులమ్మి ,అంతా సమసిపోయింది అనుకున్నది .ప్రకృతి పిలుపుకి తప్పించి గుడారం నుంచి బయటకి అడుగుపెట్టడం మానేసింది . అడుగుపెడితే ఇంక ఇంటికి పోవడమే అనుకున్నది.

**కానీ ఆమె ఒకటి తలిస్తే విధి మరొకటి తలచింది. సంఘటన జరిగిన తరువాత కొద్ది రోజులు బాగానే ఉన్న ఆమె భర్త ఆమెను వేధించడం మొదలు పెట్టాడు. మాటలతో కాదు చేతలతో ఆమెను గాయపరచడం మొదలుపెట్టాడు ఆమెకు ఏం చేయాలో పాలుపోలేదు తన సావాస గత్తె వెంకటేశ్వరి తో చెప్పుకున్నది. జరిగిన ఘాతుకామా కంటే ప్రాణంతో సమానంగా తనని ప్రేమించే భర్త ఇంకో రకంగా ప్రవర్తించడం బాతులమ్మిని చాలా బాధ పెట్టింది . ఏం జరిగిందో తెలీదు ఎవ్వరికి కానీ సరిగా మరో వారం రోజులకి ఆమె శవం వెంకటరెడ్డి షెడ్డు పక్కనే ఉన్న చింత చెట్టుకి వేలాడింది. శవం దింపినప్పడు వెంకట రెడ్డి ,భార్య శవం మీద పడి ఏడుస్తున్న బాతులమ్మి మొగుడిని చావకొట్టాడు. చూస్తున్న వాళ్లు వెంకట్ రెడ్డి వాడిని ఎందుకు కొడుతున్నాడో అర్థం కాక తిక మక పడ్డారు. . ఒక రెండు రోజులకి బాతులమ్మి శరీరాన్ని ,జ్ఞాపకాలను ఆ ఊరిలో వదిలిపెట్టి ఆమె మొగుడు బాతులను తోలుకొని వెళ్లిపోయాడు. వచ్చేటప్పుడు దారంతా ఒకవైపు భర్త ఒకవైపు భార్య ఒక వైపు నడుస్తూ తోలుకొచ్చిన బాతులు,ఈ సారి రెండోవైపు సరైన మార్గంలో పెట్టే వాళ్లు లేక దారంతా గందరగోళం చేస్తూ బాతులమ్మి మొగుడిని ఇబ్బంది పెట్టాయి.**

ఇదిగో ఇది జరిగిన ఒక నెలకి టౌన్ నుండి సరైన బస్సు దొరక్క డొంకదారి దగ్గర బస్సు దిగి రాత్రిపూట ఒంటరిగా నడుచుకుంటూ వస్తున్నాడు మా ఊరి కొత్త అల్లుడు ఒకాయన. సరిగా చింత చెట్టు దగ్గరికి వచ్చాడో లేదో , వెనక నుండి ఎవరో బలంగా ముందుకు తోసినట్టు పడిపోయాడు. కాళ్లు చేతులు కొట్టుకుపోయాయి.లేచి నిలబడి కొట్టుకు పోయిన కాళ్ళను తుడుచుకుంటూ ఉంటే యెర్ర గుడ్డలు కట్టుకున్న ఆడ మనిషి పెద్దగా నవ్వుతూ చింత చెట్టు కిందికి వెళ్లి మాయమయింది కొత్త అల్లుడు ఝడుపు జ్వరంతో నెల రోజులు అత్తింట్లోనే మకాం పెట్టాల్సి వచ్చింది అది మొదలు ఆ దారిలో రాత్రిపూట వచ్చేవాళ్లు తట్టుకుని పడిపోవడం, సైకిల్ మీద వచ్చే వాళ్ళకి ఏ దున్న పోతో ,పంది పిల్లో అడ్డం వచ్చి పడిపోవడం జరిగేది. దయ్యాలని చూసే శక్తి ఉండే కొందరికి సుగాలి పిల్ల ఎర్ర బట్టల్లో మెరిసిపోతూ గాజులు కడియాలు గలగలమనిపించుకుంటూ రోడ్డు మీద నుండి చింత చెట్టు కిందకి వెళ్తూ కనిపించేది. అప్పటినుండి రాత్రయితే మనుషులు జతలుగా, గుంపుగా తప్పించి ఒంటిగా రావడం మానేశారు. ఇప్పటికి కూడా ఆ దారిలో రావాలంటే అందరూ భయపడి పోతారు . అంత దాకా ఎందుకు ఈ లేఅవుట్ వేసిన పెద్దాయన ఆ చెట్టుని నరికించాలని చూశాడు, కానీ హఠాత్తుగా భార్యకి గుండెపోటు రావడంతో ఆ ప్రయత్నం మానుకున్నాడు అటువంటి స్థలాన్ని కొంటానంటావే పెద్దమనిషీ నువ్వు !తెలియకపోతే పది మందిని అడిగి తెలుసుకోవాలి అని కథ ముగించాడు మందలింపుగా చరణ్ పెద్దాయన చెప్పిన కథంతా శ్రద్ధగా విని"అంతా బానే ఉంది కానీ పెద్దాయన ,వెంకటరెడ్డి చేసిన పాపాన్ని వాడి మీద తీర్చుకోకుండా ఈ దయ్యం ఊరు మీద పడటం బాగుందా"అన్నా డు . చరణ్ అన్న మాటలకి తల ఊపి చెవి పైన దాచిన బీడీని తీసి వెలిగించుకుంటూ" వెంకట రెడ్డిని ఎందుకు వదిలింది, ఆరోజు నుంచి ఈ రోజుటి వరకు ముక్కారు పంట పండే ఈ వెంకటరెడ్డి భూమి బీడుగా మారి పోలా,అలా చేసి వదిలి పెట్టింది బాతులమ్మి అని అందరికీ తెలుసు కదా . ఇక్కడ ఏ పంట వేసిన గిటకబారిపోతుంది ,ఎన్ని నీళ్లు పట్టినా బీటవారిపోతుంది .

**ఇప్పుడు ఈ లే అవుట్ వేసారే ,ఈ పొలం అంతా ఆ వెంకట రెడ్డి వాళ్లదే . రేపు ఇల్లు కట్టుకొని ఎవరన్నా నాలుగు పూల చెట్లు వేసుకుందాం అనుకున్నా అవి బతికి బట్టకట్టవు . అయినా ఆ అమ్మి మొగోళ్ళని మాత్రమే కొడుతుంది . ఆడోళ్ళని ,పిల్లల్ని తాకిన దాఖలాలు ఇంతవరకు లేవు లే "అన్నాడు ముసలాయన చరణ్ ఆ ముసలాయన అన్న మాటల్ని మూఢనమ్మకంగా కొట్టేసినట్టు "అయితే పెద్దాయన ! కథంతా నువ్వు చూసినట్టే భలే చెప్పావే ఇంత బాగా ఎలా తెలుసు నీకు"అన్నాడు. పెద్దాయన మేకలనంతా ఒకచోటికి తోలుకొచ్చి ఇక బయలుదేరబోతూ " బాతులమ్మి సావాసగత్తె వెంకటేశ్వరి మా అవ్వ ,మా అవ్వ మా అమ్మకి చెప్తే, మా అమ్మ నాకు చెప్పింది అందుకని తెలుసు" అన్నాడు. చరణ్ కూడా ముసలాయనతో పాటు లేచి బస్సు కోసం రోడ్డు పైకి వచ్చాడు. వస్తూ వస్తూ ముసలాయన వంక చూస్తూ" ఇంతకీ ఆ దయ్యం పేరు ఏమిటి పెద్దాయన" అన్నాడు. పెద్దాయన బుర్ర గోక్కుని "దెయ్యాలకి కూడా పేర్లు ఉంటాయా "అన్నాడు**


చరణ్ టౌన్ కి బయలుదేరేటప్పటికీ సూర్యుడు ఎర్రగా పడమటి దిక్కుకి జారుతున్నాడు . చలికాలపు చీకట్లు గాఢంగా అలుముకుంటూ వున్నాయి . అతను వెళ్లే దారిలో ,దయ్యపు చింత చెట్టుని దాటుకుంటూ వెళ్ళాడు, చూసుకుంటూ వెళ్ళాడు . దాని విస్తీర్ణతను దాని పచ్చదనాన్ని అంచనా వేస్తూ వెళ్ళాడు. చింత చెట్టు విశాలతను ,పచ్చదనాన్ని గురించి ఆలోచిస్తూ ఉంటే అతనికి ఎత్తైన, సుందరమైన బాతులమ్మి రూపం, చింత చెట్టు రూపం ఒకేలాగ అనిపించాయి . కళ్ళు మూసుకున్న చరణ్ కి ఆ వెనుకే ఆమె అమితంగా ప్రేమించిన ఆమె భర్త రూపం ఆకాశంలో మేఘంలా పొడ కట్టింది . ఇంటికి వచ్చిన తర్వాత అతను భార్యకి ముసలాయన చెప్పిన కథను చెప్పలేదు . స్థలం నచ్చిందని ,ఆ స్థలంలో మంచి చింత చెట్టు ఉందని మాత్రమే చెప్పాడు . ఆ తర్వాత ఒక వారానికి పేరు లేని దయ్యం ఉన్నఆ స్థలాన్ని తన పేరున రిజిస్టర్ చేయించుకున్నాడు భానోవత్ చరణ్.

# కొత్త పొద్దుకోసం



అనుభవము, వ్యక్తీకరణ అనే రెండు కృత్యాలకి కవిత్వ సృజనలో చాలా ప్రాముఖ్యత ఉన్నది. సృజనానుభవం, పఠనానుభవంగా మారే క్రమం లో అనుభవం ఎంత సాంద్రంగా ఉంటే వ్యక్తీకరణ అంత సాంద్రంగా ఉండాలి. అనుభవం సాంద్రంగా వుంది వ్యక్తీకరణ బలహీనంగా ఉన్నా,అనుభవం బలహీనంగా ఉండి వ్యక్తీకరణ సాంద్రంగా ఉన్నా రసాభాస అవుతుంది. ఈ రెండింటి మధ్యా సమన్వయం సాధించటం అంత తేలికైన విషయం కాదు. అధ్యయనము, అభ్యాసము రెండూ జమిలీగా సాగితే తప్ప సమన్వయం పట్టుబడదు. ఈ సమన్వయం అలవోకగా సాధించిన కవి గట్టు రాధికామోహన్. ఆమె రెండవ కవిత్వ సంపుటి కొత్త పొద్దుకోసం చదువుతుంటే ఆ సమన్వయం చూసి ఆశ్చర్యం కలుగుతుంది.

స్త్రీల కవిత్వం బలహీనంగా ఉంటుంది. వాళ్లకు కవిత్వాంశ పట్టుబడదు లాంటి విమర్శలు ఉధృతంగా వస్తున్న రోజులలో వైదేహి అనే కన్నడ కవయిత్రి "మీకు రసం పెట్టడం వచ్చా?" అని ఒక కవిత రాసింది. కుంపటి రాజేయడం దగ్గరనుండి రసం తయారీ వరకు ఉన్న వివిధ దశలని వర్ణించి కవిత్వం రాయడం అంతకంటే కష్టమా? అని ప్రశ్నిస్తుంది. ఆ కవిత కన్నడ నాట చాలా సంచలనం సృష్టించింది. గట్టు రాధికా మోహన్ ఎల్లిపాయ తొక్కు అన్న కవిత చదువుతుంటే నాకు వైదేహి కవిత గుర్తుకువచ్చింది. ఎల్లిపాయ తొక్కు ను ఎంత సాంద్రత తో రాసింది అంటే మామూలు మాటలలో చెప్పలేము. ఆ కవిత చదువుతూ తన మిగతా కవిత్వం కూడా ఇంతే సాంద్రత తో ఉంటుందా? అని సందేహపడుతూ లోపలకు వెళితే రాధికా మోహన్ నిరాశ పరచలేదు. ఈ కవిత్వాన్ని శ్రీరామ్ పుప్పాల "పాశం బువ్వ" అన్నాడు. పాశం బువ్వ లో తీపి మాత్రమే ఉంటుంది. ఈ కవిత్వం ఒక్క తీపి మాత్రమే లేదు. అందుకే ఇది ఎల్లిపాయ తొక్కుకూడా రాధికామోహన్ కి తన అనుభవంలోకి వచ్చిన ఏ విషయాన్ని అయినా కవిత్వం చేయడం లో ఒక అలవోకట్నంవున్నది. అంటే పెద్దగా కష్టపడకుండా ఆడుతూ పాడుతూ కవిత్వం చేయడం అన్నమాట. ఈ అలవోకతనం ఎలా పట్టుబడుతుంది అంటే కవిత్వం చేసే అంశం లోలోపల పూర్తిగా ఇంకిపోతే తప్ప అలవాటు కాదు. నేను పుట్టకముందే నా పేరు దేశ ద్రోహుల లిస్ట్ లో రాసి వుంది నా పేరు అని కవి ఖాదర్ మొహియుద్దీన్ తన పుట్టుమచ్చ లో తనను దేశానికి పరాయి ని చేసిన వైనాన్ని ఎలుగెత్తి రాస్తే రాధికా మోహన్. నేను పుట్టకముందే దీన్ని నాపేరు మీద రాశిచ్చినందుకో ఏమోగని నా నవ్వులను,ఏడుపులు మోసుకుంట మనసును నిమ్మలం జేస్తుంటది అంటుంది ఆగ్నేయపు అర్ర కవితలో! ఆగ్నేయపు అర్ర అంటే వంటగది. వాస్తు ప్రకారం అగ్ని ఎప్పుడూ ఆగ్నేయం లో ఉండాలి కనుక వంటగదిని ఆగ్నేయం లో కట్టడం ఆనవాయితీ. నేను కవి ఖాదర్ ఉదాహరణ ఎందుకు తీసుకుని వచ్చాను అంటే ఈ దేశం లో పుట్టిన ఎవరైనా ఈ దేశ వారసత్వానికి, సార్వభౌమత్వానికి, పౌరసత్వానికి హక్కుదారులు అవుతారు. కానీ ఒక మతం కారణంగా పుట్టకముందే దేశ ద్రోహుల జాబితాలో పేరు చేర్చడం అంటే అదొక అమానవీయ వివక్ష. అలాగే ఒక స్త్రీ కి పుట్టకముందే వంటగదిని రాసివ్వడం అంటే అది కూడా అమానవీయ వివక్ష కంటే తక్కువేమీ కాదు. శత్రువును ప్రేమించడం లాంటి స్కాట్ ల్యాండ్ ఎఫెక్ట్ లాగా ఆగ్నేయపు అర్ర తన నవ్వులను, ఏడుపులను మోసుకుంట మనసును నిమ్మలం జేస్తుంటది అనటం రాధికామోహన్ సాధించిన కవితా న్యాయం . హనుమకొండ జిల్లాకు చెందినది కనుక ఆమె రాసిన తెలంగాణా భాష, సగటు తెలుగు సినిమా తెలంగాణా బాష లా కృతకం గా లేక స్వచంగా సరళం గా ఉండి చదువుతుంటే మనసుకు ఒక హాయిని ఇస్తుంది. ఒక రొమాంటిక్ హంట్ ను అతను నేను అనే కవిత లో ఎంత హాయిగా చెప్పిందో చదివితే తప్ప అనుభవైక వేద్యం కాదు. అతనేమో పొద్దాక భగ భగ మసిలిపోయినందుకేమో ఓ వైపొంగి షెమాటలను తూడ్సుకుంట సల్లబడుతాండు నేనేమో ఎనక బుసలు గక్కే గాలినిడుత్తాంటే కొంగు నొల్లంత కప్పి శేతులు ముడుసుకొని గాజద్దం నుండి బైటికి సూత్తాన ఇలా సాగే కవిత ఆకాశంలో చందమామ కీ నేలమీద సందమామ కీ నడుమ జరిగే రొమాంటిక్ హంట్ ను చాలా రొమాంటిగ్గా దృశ్యం చేస్తుంది. గ్రామీణ నగర జీవితాలకు నడుమ ఉన్న వైవిధ్యాన్నీ, వైరుధ్యానీ, గతించిన బాల్యావస్థ నోస్టాల్జియాను, స్త్రీ జీవితాన్ని ఎలా ఇంటెన్సిటీ తో కవిత్వం చేసిందో మిగతా సామాజిక సమస్యలపట్ల, సామాజిక వైషమ్యాల పట్ల తన ఆలోచనల తీవ్రతను కూడా అంతే ఇంటెన్సిటీ తో కవిత్వం చేసింది. ఆగ్నేయపు అర్ర , ఆల్ ఇన్ వన్ ఈ రెండు కవితల మధ్యా ఉన్న వైరుధ్యాన్ని రాధికామోహన్ ఎలా సమర్థించుకుంటుందో తెలియదు కానీ అమ్మను గ్లోరిఫై చేసే క్రమం లో ఆగ్నేయపు అర్ర లో అమ్మను లేదా స్త్రీని కేవలం సేవలకు ప్రతిరూపంగానూ, ఉత్పత్తి కార్యకలాపాలకు దూరంగానూ ఎలా సమాజం మలచిందో తానే వివరించిన క్రమాన్ని మరచిపోయింది. అమ్మ గర్భం లాంటి దుష్ట సమాసాలు కవిత్వం లో రాకుండా చూసుకుంటే బావుంటుంది. మతం లేని కులం లేని కొత్త ఆలోచనల భావాలు తెల్లటి రెక్కలు విప్పార్చుకునే కొత్త పొద్దుకోసం, ఆ కొత్త పొద్దు దేదీప్యమానం చేసే మానవత్వపు వెలుగుల కోసం రాధికా మోహన్ హృదయం లో జరిగిన ఘర్షణ ల సారం ఈ కొత్త పొద్దుకోసం



- వంశీకృష్ణ

మహా పత్రిక సాహిత్య పేజీకి పంపే రచనలు
ఈ WHATSAPP NO.9247580946కు
mahaapatrika@gmail.comకి పంపించగలరు.



## నేటి ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమం రద్దు

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్, మహా:** ఫిబ్రవరి 10వ తేదీ (సోమవారం) వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తెలంగాణ లెజిస్లేటివ్ కౌన్సిల్ (MLC) టీచర్ కన్స్టిట్యూన్సీ ఎన్నికలు.. పరిపాలన పరమైన కారణాల దృష్ట్యా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద నేడొక ప్రకటనలో తెలిపారు. ఇట్టి విషయాన్ని గమనించి జిల్లా నలుమూలల నుండి ప్రజలు ఫిర్యాదులు అందించుటకు కలెక్టరేట్ కార్యాలయానికి రావద్దని, కలెక్టర్ ప్రకటన లో తెలిపారు.

## కే యూ సి పోలీస్ స్టేషన్లో సిబ్బంది శ్రమదానం



**హనుమకొండ, మహా:** పరిసరాల పరిశుభ్రత ద్వారా పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదారులకు మరింత ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం కోసం కేయుసి పోలీస్ స్టేషన్ ఇన్స్ స్పెక్టర్ రవికుమార్ సిబ్బందితో కలసి స్టేషన్ ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను, చెత్తను తొలగించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రం చేయడంతో పెద్ద మొత్తంలో మొక్కలను పెంపకం చేపట్టడం కోసం స్టేషన్ సిబ్బందితో కలసి ప్రణాళికను రూపొందించుకొని త్వరలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించాలని కెయూసి పోలీసులు నిర్ణయించారు.

## నూతన కమ్యూనిటీ హాలును ప్రారంభించిన ఎమ్మెల్యే



**ఇబ్రహీంపట్నం, మహా:** మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. తుర్క యాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని సూరజ్ నగర్ కాలనీ పేస్3లో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్ ను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, మాజీ కౌన్సిలర్లు కోషిక ఐలయ్య, పలువురు కార్యకర్తలు నేతలు తదితరులు పాల్గొన్నారు

## సప్తాహ వేడుకల్లో పాల్గొన్న కంది మౌనా శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం నిరాల గ్రామంలో జరుగుతున్న సద్గురు దాదాజీ మహారాజ్ సప్తాహ వేడుకలకు ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి హాజరయ్యారు. నిర్వాహకులు గ్రామస్తులు ఆమెకు ఆత్మీయ స్వాగతం పలికారు. ఆలయంలో దాదాజీ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు హారతి లో పాల్గొన్నారు. భక్తులను ఆత్మీయంగా పలకరించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆమెను శాలువాతో సత్కరించారు. అనంతరం బేల మండలం చప్రాల గ్రామంలో జరిగిన బాజీరావు బాబా భవ్యజ్ఞానేశ్వరీ పారయణ్ సప్తహ వేడుకలలో సప్తాహ దహి హండి కాల వేడుకలకు ఆమె హాజరయ్యారు.బాజీరావు బాబా పల్లకిని భుజాలపై మోసి పల్లకి సేవలో పాల్గొని తరించారు. గ్రామస్తులంతా భక్తి శ్రద్ధలతో ఇంత మంచి ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించుకోవడం చాలా హర్షణీయమన్నారు. గ్రామంలో యువత కూడా చెడు అలవాట్లకు దూరంగా భక్తి మార్గంలో నడుస్తుండడం సంతోషంగా ఉందన్నారు. ఇదంతా పూజ్య బాజీరావు బాబా బోధనల వల్లే సాధ్యమైందన్నారు.తన బోధనల ప్రభావం వల్ల



అనేక గ్రామాలు సత్ పరివర్తన చెంది ఆధ్యాత్మిక పరిమళాలలు వెదజల్లుతున్నాయన్నారు.చప్రాల గ్రామంలో ఇంత మంచి కార్యక్రమంలో పాల్గొనడం తన అదృష్టమన్నారు. అనంతరం నిర్వాహకులు ఆమెను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావ్,జైనథ్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు విలాస్ పటేల్,కాంగ్రెస్ పార్టీ బేలా మండల అధ్యక్షులు ఫైజల్లా ఖాన్,మాజీ జడ్పీటీసీ రాందాస్ నాక్లే, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి, చంద్రకాంత్.విపిన్ గారు గ్రామ నాయకులు సాగర్ టాక్రే,హేమంత్ పటేల్, మహిళా నాయకురాలు శ్రీలేఖ ఆదివాసీ, దేశెట్టి ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.



## స్వరాజ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మేకల యాదగిరి రెడ్డి

**శుభాకాంక్షలు తెలియజేసిన కాలనీవాసులు**

**మేడిపల్లి, మహా:** మేడిపల్లి మండలం ఫిర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో స్వరాజ్ వెల్ఫేర్ అసోసియేషన్, మల్లికార్జున్ నగర్ కాలనీ అధ్యక్షుడిగా మేకల యాదగిరి రెడ్డి ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నా విజయానికి సహకరించిన కాలనీవాసులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. కాలిని అభివృద్ధి కోసం నా వంతు ఎల్లవేళలా సహకరిస్తానని అని అన్నారు. ఎన్నికల భాగంగా నాకు మద్దతుగా నిలిచిన మాసయ్యగౌడ్, నాగభూషణం గౌడ్, శ్రీహరి, వెంకటేష్, రామకృష్ణ, అనిల్ రెడ్డి, మోహన్ రెడ్డి, ఏవీబీ చారి, సర్వేశ్, దర్మయ్య ఒగ్గు, బాల్‌రాజ్, శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులకు సభ్యులందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని అన్నారు. కాలనీ నూతన అధ్యక్షుడిగా మేకల యాదగిరి రెడ్డి గెలుపొందిన సందర్భంగా కాలినివాసులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఆస్తులు కూడబెట్టడం కన్నా దానగుణం గొప్పది

- విద్యార్థులు పట్టుదలతో ఉన్నత కొలువులు సాధించాలి.. రాష్ట్ర మంత్రి సీతక్క
- మలబార్ సొసైటీ ఆధ్వర్యంలో 340 మంది పేద బాలికలకు స్కాలర్ షిప్స్ పంపిణీ




**ములుగు, మహా :** కష్టపడి తరతరాల కోసం ఆస్తులు కూడబెట్టడంతో పాటు దాన గుణంతో పేదలకు సాయం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) పిలుపునిచ్చారు. విద్యార్థులు కష్టపడి చదువుతూ ఉన్నత కొలువుల్లో రాణించాలని సూచించారు. ఆదివారం ములుగు డీఎల్ ఆర్ ఫంక్షన్ హాల్ లో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 340మంది బాలికలకు రూ.10వేల చొప్పున స్కాలర్ షిప్స్ అందించగా మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలికలు, మహిళల సాధికారత కోసం, పేద బిడ్డల అభ్యున్నతి కోసం 340మంది బాలికలకు స్కాలర్షిప్స్ అందించడం హర్షణీయమన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని 116కళాశాలల్లో చదువుతున్న 3,900 మంది బాలికల విద్యకు మద్దతుగా ఉపకార వేతనాలు అందించడం గొప్ప విషయం అన్నారు. రూ.3.14కోట్లు బాలికల చదువుకు కేటాయించడం సంతోషకరమని పేర్కొన్నారు. మలబార్ గోల్డ్ & డైమండ్స్ జోనల్ హెడ్ శ్రీ షానిబ్.కె, రాకేష్ రెడ్డి, మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి.అహమ్మద్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా



21,000 మంది బాలికల విద్యకు మద్దతుగా రూ.16కోట్లను కేటాయించామన్నారు. ప్రపంచాన్ని మార్చే అత్యంత శక్తివంతమైన సాధనం విద్య అని, విద్యావకాశాలను విస్తృతం చేయడం, జీవితాలను మార్చడం మలబార్ గ్రూప్ బలమైన నమ్మకానికి నిదర్శనం అన్నారు. సమాజంలో యువతులకు ఉన్న అడ్డంకులను తొలగించడానికి కట్టుబడి ఉన్నామన్నారు. మలబార్ గ్రూపు లాభాలలో 5శాతం విద్య ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, పేదరిక నిర్మూలన వంటి సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మలబార్ గోల్డ్, డైమండ్స్ వరంగల్ షోరూం హెడ్ అజీశ్ అహ్మద్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్, తదితరులు పాల్గొన్నారు.

## మహా కుంభాభిషేకంలో పాల్గొన్న మంత్రులు





**వరంగల్, మహా:** భూపాలపల్లి జిల్లా మహదేవ్ పూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర దేవాలయంలో 42 సంవత్సరాల సుదీర్ఘ కాలం తర్వాత నిర్వహించిన మహా కుంభాభిషేకంలో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ తోపాటు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. వేద పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య శృంగేరి పీఠానికి సంబంధించిన తపోవన పీఠాధిపతి శ్రీ సచ్చిదానంద సరస్వతి ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తుల రాకతో మహాకుంభాభిషేకం జరుగుతున్నంత సేపు ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మారుమోగింది. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల త్రివేణి సంగమం వద్ద వెలసిన కాళేశ్వర ముక్తేశ్వర దేవస్థానం ప్రాచీనమైనది, ప్రాశస్త్యమైనదని అన్నారు. ముక్తేశ్వర, కాళేశ్వరులు కొలువైన దేశంలోనే ఏకైక దేవస్థానం తెలంగాణలో వుండటం మన అదృష్టమని అన్నారు. గంగా, యమునా, సరస్వతి సంఘమైన ప్రయాగరాజ్ లో మహాకుంభమేళ జరుగుతున్న సమయంలోనే కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో మహాకుంభాభిషేక ఘట్టం ఆవిష్కృతం కావడం గొప్ప అనుభూతినిచ్చిందని మంత్రి తెలిపారు. రాబోయే రోజుల్లో మే 15 నుంచి 26 వరకు నిర్వహించనున్న సరస్వతి నది పుష్కారాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయానికి భక్తులతో సదుపాయాల గురించి కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, ఆర్జేసీ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులకు ఘన సత్కారం



**వరంగల్ ఏసిపి నందిరాం నాయక్**

**వరంగల్, మహా:** ఇటీవల కేసులో అన్ని రకాల సాక్షులను సాక్ష్యాధారాలను కోర్టులో సమయ అనుకూలంగా ప్రవేశపెట్టి ఎప్పటికప్పుడు పోలీసు అధికారులను, న్యాయవిధులను అప్రమత్తం చేసి ప్రతిష్టాత్మకమైన ఓ కేసులో యావజీవ కారాగార శిక్ష విధించుటకు కృషి చేసిన హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు ను వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏసీపి మాట్లాడుతూ ఇలాంటి తీర్పులు సమాజంలో నేరస్తులు ఎటువంటి వారైనా తప్పుచుకోలేరని నేరస్తుల గుండెల్లో న్యాయస్థానం తీర్పు నిద్రపోతుందని ఇదొక ఇది ఒక చారిత్రాత్మక తీర్పు అని అభినందించడం జరిగింది. ఏసీపీ తోపాటు మట్టేవాడ సీఐ తుమ్మ గోపి, మిల్స్ కాలనీ సీఐ వెంకటరమణ, ఎస్సైలు, ఇతర పోలీస్ అధికారులు ఆయనకు అభినందనలు తెలిపారు.

## శ్రీ మహాలక్ష్మి తల్లిని దర్శించుకున్న చిన్నమ్మ



**శ్రీకాకుళం జిల్లా, మహా:** రణస్థలం మండలం, కమ్మశిగడాంలో శ్రీ మహాలక్ష్మి తల్లి జాతర మహోత్సవానికి ఎచ్చెర్ల నియోజకవర్గం శాసన సభ్యులు శ్రీ.నడుకుదిటి ఈశ్వరరావు ఆహ్వానం మేరకు మాజీ మంత్రి, రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు మరియు రాజమండ్రి పార్లమెంట్ సభ్యులు *శ్రీమతి దగ్గుబాటి పురంధేశ్వరి * శ్రీమహాలక్ష్మి తల్లి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, ఎన్డీయే కూటమి నాయకులు, బీజేపీ సర్పంచ్ రజనీ NER కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు...

## పుట్టిన రోజు వేడుకలలో పాల్గొన్న కంది మౌనా శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ జిల్లా బేల మండలం చప్రాల గ్రామ కాంగ్రెస్ నాయకుడు టాక్రె సాగర్ అక్షిత దంపతుల కుమారుడి రెండవ పుట్టిన రోజు వేడుకలకు అదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కంది శ్రీనివాసరెడ్డి సతీమణి కంది మౌన శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. దంపతులను అభినందించి చిన్నారి ఆయుష్‌ను చిరు కానుకతో దీవించారు.కేక్ తినిపించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావ్,జైనథ్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు విలాస్ పటేల్,కాంగ్రెస్ పార్టీ బేలా మండల అధ్యక్షులు ఫైజల్లా ఖాన్,మాజీ జడ్పీటీసీ రాందాస్ నాక్లే, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి, చంద్రకాంత్.విపిన్ గారు గ్రామ నాయకులు సాగర్ టాక్రే,హేమంత్ పటేల్, మహిళా నాయకురాలు శ్రీలేఖ ఆదివాసీ,దేశెట్టి ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

## మై హోమ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం




**హుజూర్ నగర్, మహా :** మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మరియు సంకల్ప సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ సౌజన్యంతో మఠంపల్లి మండలం చౌటపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరము నిర్వహించారు. వైద్య శిబిరాన్ని సంస్థ సీనియర్ జనరల్ మేనేజర్ నాగేశ్వరావు స్థానిక ప్రజా ప్రతినిధుల తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ప్రతీ సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా చౌటపల్లి గ్రామం నందు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు. పరిసర గ్రామాల్లో కూడా ముమ్మందు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిం చనున్నట్లు ఆయన తెలిపారు, వైద్య శిబిరానికి సహకరించిన ప్రజా ప్రతినిధులకు,గ్రామస్తులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ క్యాంపు నందు న్యూరో, జనరల్ మెడిసిన్,ఎముకలు కీళ్లు మరియు చిన్నపిల్లల డాక్టర్లు పాల్గొని సుమారు 850 మందికి ఉచితంగా వైద్యాన్ని అందించి మందులు అందజేశారు ఈ క్యాంపులో డాక్టర్ చైతన్య , డాక్టర్ సీతారామ్ ,డాక్టర్ అనిల్ రెడ్డి , డాక్టర్ రాకేష్, డాక్టర్ భార్గవి మరియు సంస్థ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి కిరణ్ పాల్గొన్నారు. అలాగే భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇండియన్ బ్యూరో మైన్స్ చేపట్టిన టి.బి హరేగా దేశ్ జీతేగా కార్యక్రమంలో భాగంగా టి.బి (క్షయ వ్యాధి ) పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి సంవత్సరము ఉచితంగా క్యాంప్ నిర్వహిస్తున్న మై హోమ్ యాజమాన్యం వారికి గ్రామ ప్రజా ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌటపల్లి గ్రామ ప్రజా ప్రతినిధులు వెంకట నారాయణ, కృష్ణ వేణి నరేష్, సింగారాపు సైదులు,రాంరెడ్డి, లింగయ్య, గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లు

**పరిశ్రమ మైన్స్**

ఏ.జి.యం.నరేష్ ఏ.జి.యం శ్రీనివాస్, హెల్త్ ఆఫీసర్ శ్రీను పాల్గొన్నారు.

## మోగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నగారా.!

**వరంగల్, మహా:** తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఈ నెల 15వ తేదీ లోగా వెలువడే సూచనలు కనిపిస్తున్నాయి. బీసీ రిజర్వేషన్ల సంబంధించి ఏర్పాటైన డెడికేటెడ్. కమిషన్ సోమవారం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు తెలిసింది. ఈ నివేదికపై చర్చించాక స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ,ఎస్టీ,బీసీ రిజర్వేష



న్ల కోటాను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేయనుంది. అనంతరం రిజర్వేషన్ల ఖరారు తో పాటు ఎన్నికల తేదీల పైనా రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ)కు ప్రభుత్వం తన నిర్ణయాన్ని తెలియజేయనుంది.

## ప్రమాదకరంగా మూతలు లేని మ్యాన్ హోల్

**ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న బల్దియా**



**వరంగల్, మహా:** వరంగల్ నగరంలోని 28వ డివిజన్ వరంగల్ చౌరస్తా అత్యంత రద్దీగా ఉండే ప్రాంతమైన డాల్ఫిన్ గల్లీకి ఎదురుగా ఉన్న బందిలి శెట్టి వీధి మెయిన్ రోడ్డు పక్కన మూత లేకుండా మ్యాన్ హోల్ ఓపెన్ చేసి ప్రమాదకరంగా ఉంది. డివిజన్లో ఇదొక్కటే కాకుండా దాదాపు పది వరకు మ్యాన్ హోల్ లకు మూతలు లేవని స్థానికులు చెబుతున్నారు. ప్రజల నుండి పన్నులు వసూలు చేసే బల్దియా అధికారులు సిబ్బంది అదే ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇటువంటి మూతలు లేని మ్యాన్ హోల్ లో చిన్నపిల్లలు, వృద్ధులు, చూడకుండా ఎవరైనా అందులో పడితే ప్రాణాపాయం జరిగే అవకాశం లేకపోలేదు. ఇందుకోసం జిడబ్ల్యుఎంసీ సిబ్బంది చొరవ తీసుకొని ఆ మ్యాన్ హోల్ లను మూయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు అంటున్నారు. నిత్యం వందలాది వాహనాలు ప్రయాణించే ఈ దారిలో ప్రమాదకరమైన రీతిలో ఉన్న ఇందులో ఎవరైనా నడక దారిన వెళ్లే ప్రజలు, రాత్రి వేళల్లో అందులో పడితే ఎవరు దానికి బాధ్యులు? అని ప్రజలు మున్సిపల్ అధికారులను ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ అధికారుల అలసత్వం సిబ్బంది నిర్లక్ష్యం కనిపిస్తుంది. ఇప్పటికైనా అధికారులు సిబ్బంది స్పందించి నగరంలో ఎక్కడైనా మూతలు లేని మ్యాన్ హోల్ లను మూసివేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ఐ ఐ సి టి కాలనీవాసుల ఆధ్వర్యంలో సింగిరెడ్డి పద్మా రెడ్డికి ఘన సన్మానం

**5వ డివిజన్ ను ఆదర్శవంతంగా అభివృద్ధి చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు**



**మేడిపల్లి, మహా:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 5వ డివిజన్ కార్పొరేటర్ గా సింగిరెడ్డి పద్మారెడ్డి 5 సంవత్సరాల పదవి కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా ఐ ఐ సి టి కాలనీ అధ్యక్షులు నరేందర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో సింగిరెడ్డి పద్మారెడ్డి ని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం,డివిజన్ అభివృద్ధి లక్ష్యంగా నిరంతరం కృషి చేసి 5వ డివిజన్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ భవిష్యత్తులో రాజకీయంగా మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు మరింత సేవలు చేయాలని పలువురు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఐ ఐ సి టి కాలనీ చీఫ్ అడ్వైజర్ బుచ్చిరెడ్డి, సెక్రెటరీ రుద్ర దాసు, మూర్తి రాజు మరియు కమిటీ సభ్యులు కాలనీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంజీఎం లో డుమ్మాల ఉద్యోగులపై చర్యలేవీ.?

**పట్టించుకోని అధికారుల తీరు పై పలు అనుమానాలు**

**వరంగల్, మహా:** ఎంజీఎం ను జిల్లా కలెక్టర్ స్వయంగా పలుమార్లు సందర్శించి కొంత వరకు ప్రక్షాళన చేసినప్పటికీ కొంతమంది ఉద్యోగుల తీరు మార్చుకోవడం లేదు. ఎంజీఎం పరిపాలన విభాగంలో పనిచేస్తున్న డుమ్మాల సీనియర్ ,జూనియర్ అసిస్టెంట్ల పై చర్యలు తీసుకోవడానికి ఎంజీఎం అధికారులకు ధైర్యం రావడం లేదు...విధులకు ఎగనామం పెట్టిన, హాజరు పట్టిక లో ఖాళీ గడులు ఉంచి డుమ్మాలు కొట్టిన మరుసటి రోజు సంతకాలతో లెక్క సరిచేసిన వీరిపై చర్యలకు ఎంజీఎం అధికారులు ససేమిరా అంటునట్లే కనిపిస్తోంది... డుమ్మాల వ్యవహారం లో,హాజరు పట్టిక ఖాళీ గడుల విషయంలో అక్కడి ఏ ఓ ,ఆ ఇద్దరు సీనియర్ ,జూనియర్ లదే హస్తమని తెలిసిన ఎంజీఎం అధికారులు మాత్రం తమకేం అవసరం అన్నట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి...చూస్తాం ,చేస్తాం అంటూ కాలం వెళ్లదీస్తూ ఆ ఇద్దరు ఉద్యోగులపై చర్యలు తీసుకోవడానికి మీన మేషాలు లెక్కిస్తున్నారు...చర్యలు తీసుకోకుండా




వారిని కాపాడడానికి ఎంజీఎం అధికారులు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి...

### ఎమ్మెల్యే అండ ఉందా.?

కాగా తాము ఎం చేసిన తమను అధికారులు ఎవరేం చేయలేరని జూనియర్ ,సీనియర్ ధీమా వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది గ్రేటర్ వరంగల్ కు చెందిన ఓ ఎమ్మెల్యే తో తమకు బాగానే సాన్నిహిత్యం ఉందని అందుకే అధికారులు తమపై చర్యలకు వెనుకాడుతున్నారని ప్రచారం చేసుకుంటున్నట్లు తెలిసింది అధికారులు తమపై చర్యలు తీసుకోవాలని చూసిన ఎమ్మెల్యే నుంచి ఫోన్ రావడంతో ఆగిపోతున్నారని వారు డంబాలు కొడుతూ సదరు ఎమ్మెల్యే ను సైతం బద్నాం చేస్తున్నట్లు సమాచారం...ఆ ఎమ్మెల్యే తో వీరికి ఏపాటి సంబంధాలు వీరికి ఉన్నాయో తెలియదు కాని జూనియర్,సీనియర్ అసిస్టెంట్లు మాత్రం వారికి ఇష్టం వచ్చినట్లు ప్రచారం చేసుకుంటున్నట్లు తెలుస్తుంది....ఒకవేళ నిజానికి ఎమ్మెల్యే వీరికి సహకరిస్తుంటే ఇలాంటి వారికి ఎందుకు సహకరిస్తున్నారో వారికే తెలియాలని పలువురు ప్రశ్నిస్తున్నారు.

### ఇప్పటికైనా చర్యలు తీసుకుంటారా.?

ఎంజియం లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న జూనియర్,సీనియర్ అసిస్టెంట్ల పై అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకుంటారా.. ? లేక వారికే వత్తాసు పలుకుతారా...?అనే సందేహాలు ఎంజీఎం లో వ్యక్తం అవుతున్నాయి...చర్యలు తీసుకోకుండా వారు ప్రసన్నం చేసుకుంటేనే వారికి సహకరిస్తున్నారా...?అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.... మరి ఈ విషయంలో ఎంజీఎం అధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి మరి.!


# దేవులపల్లి రమేశ్ కు ప్రశంసలు




**సిద్దిపేట,నంగునూర్, మహా:** తెలంగాణ సాహిత్య అకాడమీ,మరియు తెలుగు భాషా చైతన్య సమితి, ఆధ్వర్యంలో మహాకవి దాశరథి కృష్ణమాచార్య శతజయంతి (19252025) నిర్వహించిన "దాశరథి సాహిత్య సమాలోచన"13,లో భాగంగా దాశరథి జీవితం సాహిత్యం, మనోవిజ్ఞానిక, విశ్లేషణ అనే అంశంపై డాక్టర్ సి. వీరేందర్ చేసిన ఉపన్యాసంలో పాల్గొన్న,ఎంజేపీ గురుకుల పాఠశాల, తెలుగు అతిథి ఉపాధ్యాయుడు,దేవులపల్లి రమేశ్,ను తెలంగాణ సాహిత్య అకాడమీ, కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి, తెలుగు భాషా చైతన్య సమితి, అధ్యక్షులు,పి.బడేసాబ్,డా,ఎడ్ల కల్లేష్, అభినందిస్తూ అంతర్జాలం ద్వారా పంపిన ప్రశంస పత్రాన్నికవి,రచయిత,దేవులపల్లి రమేశ్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కవులు కళాకారులు, సాహిత్య మేధావులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశ్రామికవేత్త జనార్ధనరావు దారుణ హత్య

- 86 సంవత్సరాల తాతను 73 సార్లు కత్తితో పొడిచిన మనవడు
- మృతుడు గతంలో టీటీడీకి, ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి భారీ విరాళాలు ఇచ్చిన దాత



**మహా:** ఆస్తి తగాదాల నేపథ్యంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, వెల్జాన్ గ్రూపు సంస్థల అధినేత వెలమాటి చంద్రశేఖర(వీసీ) జనార్ధనరావు (86) తన మనవడి చేతిలో దారుణ హత్యకు గురయ్యారు. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. ఏపీలోని ఏలూరు ప్రాంతానికి చెందిన జనార్ధన్‌రావు కొన్నేళ్లుగా సోమాజిగూడలో నివాసం ఉంటున్నారు. ఇటీవల తన పెద్ద కుమార్తె కుమారుడైన శ్రీకృష్ణను వెల్జాన్ కంపెనీకి డైరెక్టరుగా నియమించారు. మరో కుమార్తె సరోజినీదేవి కుమారుడైన కిలారు కీర్తితేజ(29) పేరిట రూ.4 కోట్ల షేర్లను బదిలీ చేశారు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా ఆస్తుల కోసం గొడవలు జరుగుతున్నాయి. గురువారం రాత్రి సరోజినీదేవి తన కుమారుడైన కీర్తితేజతో కలిసి తండ్రి ఇంటికి వచ్చారు. ఆస్తి పంపకాల విషయంలో తాతతో కీర్తితేజ వాగ్వాదానికి దిగాడు.. తండ్రికి టీ తెచ్చేందుకు సరోజినీదేవి ఇంట్లోకి వెళ్లగా ఇదే అదనుగా కీర్తితేజ తన వెంట తెచ్చుకున్న కత్తితో తాతను 73 సార్లు పొడిచాడు. అరుపులు, కేకలు విన్న సరోజినీదేవి పరుగున వచ్చి కుమారుడిని వారించబోయారు. ఆమెపైనా దాడిచేసి కత్తితో నాలుగు చోట్ల పొడిచాడు. అక్కడే ఉన్న కాపలాదారు వీరబాబు వచ్చేందుకు ప్రయత్నించగా దగ్గరకు రావొద్దని హెచ్చరించాడు. తర్వాత అక్కడి నుంచి కీర్తితేజ పరారయ్యాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు శనివారం నిందితుడిని పంజాగుట్టలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సరోజినీదేవి జూబ్లీహిల్స్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కీర్తితేజ మాదకద్రవ్యాలకు బానిసనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. జనార్దనరావు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి పలు దఫాలుగా రూ.40 కోట్లు, తిరుమల తిరుపతి దేవస్థానానికి రూ.40 కోట్ల విరాళాలు ఇచ్చారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు స్వచ్ఛంధ సంస్థలకు కూడా విరాళాలు అందజేశారు.



# లులూ మాల్ లో దివి

**కూకట్ పల్లి, మహా:** కూకట్‌పల్లి లులూమాల్ లో సినీనటి బిగ్ బాస్ ఫేమ్ దివి సందడి చేసింది. మాల్ లో నిర్వహించిన ఫ్లవర్ ఫెస్ట్ ని ఆమె ప్రారంభించారు. లులు మాల్ లో డిసెంబర్, జనవరి నెలలో నిర్వహించిన కొనుగోలుకు సంబంధించిన లక్కీ డ్రాను తీశారు. డ్రాలో గెలుపొందిన డైమండ్ నెక్లెస్, 5 ఫ్రిజ్ లు, 5ద్విచక్ర వాహనాలను గెలుపొందిన కూపన్ల వివరాలను వెల్లడించారు. దివి రాకతో సిని అభిమానులు సందడి చేశారు.

# వైద్యం వికటించి వ్యక్తి మృతి

## వైద్యుల నిర్లక్ష్యంమే కారణం, బంధువులు




**ఇబ్రహీంపట్నం, మహా:** తుర్క యాంజాల్ మున్సిపాలిటీ, ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని, యంజాల్ దవఖానలో వైద్యం వికటించి సత్యంగౌడ్(45) అనే వ్యక్తి మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మృతి చెందాడని దవఖాన ముందు మృతుడి బంధువులు సిపిఐ సిపిఎం నేతలు ఆందోళన చేపట్టారు. అచ్చంపేట మండలంలోని కలకంపల్లికి చెందినా సత్యంగౌడ్ తాపీ మేస్త్రి, భవన నిర్మాణాల పని నిమిత్తం తుర్కయంజాల్ కు వలస వచ్చారు. శనివారం ఉదయం కడుపు నొప్పితో దవఖానాలో చేరగా రాత్రి వరకు బాగానే ఉన్నా సత్యంగౌడ్ ఉదయం 8 ప్రాంతంలో మృతి చెందాడని వైద్యులు తెలిపారు. అయితే శనివారం రాత్రి అతని ఆరోగ్యం నిలకడగానే ఉందని చెప్పిన డాక్టర్లు, ఆదివారం ఉదయం ఉదయం కల్లా వ్యక్తి మరణించడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. డాక్టర్లు సరైన వైద్యం అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దవఖాన యాజమాన్యం వేలకొద్దీ డబ్బులు వసూలు చేస్తున్నారే తప్ప, రోగులకు సరైన వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కార్మిక సంఘం నేతలు ఆరోపించారు. మృతి చెందిన సత్యంగౌడ్ కుటుంబానికి, దవఖానా యాజమాన్యం నష్టపరిహారం అందించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆదిభట్ల పోలీసులకు మృతుడి కుమారుడు ప్రవీణ్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని సిఐ రాఘవేందర్ రెడ్డి, దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందఅని వెల్లడించారు.



శ్రీవారి లడ్డూ ప్రసాదం

# కల్తీ వ్యవహారంలో కీలక పరిణామాలు

## నలుగురిని అరెస్టు చేసిన సిబిఐ

**మహా:** దేశ వ్యాప్తంగా కలకలం సృష్టించిన తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. లడ్డూ తయారీకి నెయ్యి సరఫరా చేసిన భోలే బాబా డైరీకి (రూర్కీ, ఉత్తరాఖండ్) నాడు డైరెక్టర్లుగా పనిచేసిన విపిన్ జైన్, పోమిల్ జైన్, వైష్ణవి డైరీ(పూనంబాక) సీఈవో అపూర్వ వినయ్ కాంత్ చావ్డా, ఎఆర్ డైరీ(దుండిగల్) ఎండి రాజు రాజశేఖరన్ లను అరెస్టు చేసిన దర్యాప్తు బృందం. వీరిని తిరుపతి కోర్టులో హాజరు పరిచిన దర్యాప్తు అధికారులు. దర్యాప్తులో అక్రమాలు అనేకం బట్టబయలు అయ్యాయి. నెయ్యి సరఫరా పేరులో అడుగడుగునా ఉల్లంఘనలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఎఆర్ డైరీ పేరుతో నెయ్యి సరఫరా టెండర్లు దక్కించుకున్న వైష్ణవి డైరీ ప్రతినిధులు. ఆ డైరీ పేరును ముందు పెట్టి తప్పుడు డాక్యుమెంట్లు, సీళ్లు ఉపయోగించి టెండర్ కథ నడిపంచినట్లు సీబీఐ దర్యాప్తులో వెల్లడైంది. రూర్కీలోని భోలే బాబా దగ్గర నుంచి నెయ్యి తెప్పించినట్లు వైష్ణవి డైరీ దొంగ రికార్డులు సృష్టించింది. భోలే బాబా డైరీకి ఇంత మొత్తంలో నెయ్యి సరఫరా సామర్థం లేదని సిబిఐ విచారణలో బయటపడింది. సమగ్ర విచారణతో అక్రమాలను గుర్తించిన దర్యాప్తు బృందం..మూడు డైరీలకు చెందిన నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించింది.

# పూజారి రంగరాజన్‌పై ఘోరం


- చిలుకూరు బాలాజీ ఆలయ పూజారిపై దాడి
- పోలీసుల అదుపులో నిందితులు



**మహా :** చిలుకూరు బాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకుడు రంగరాజన్ కుటుంబంపై దాడి జరిగింది. కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు హిందూ సంస్థ పేరుతో పూజారి ఇంట్లోకి ప్రవేశించి దాడి చేసినట్లు ఆలయ మేనేజింగ్ కమిటీ ఛైర్మన్ ఎంవీ సౌందర్ రాజన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగరాజన్, అతని కుమారుడిపై విచక్షణారహితంగా దాడి చేసి కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటన జరిగి మూడ్రోజులు కాగా తాజాగా వెలుగులోకి వచ్చింది. వీసా బాలాజీ టెంపుల్‌గా పేరున్న చిలుకూరు బాలాజీ ఆలయంలో రంగరాజన్ ప్రధాన అర్చకులు అన్న విషయం తెలిసిందే. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ పరిధిలోని ఆలయానికి సమీపంలోనే అర్చకుడు కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నారు. మూడ్రోజుల కిందట పూజా కార్యక్రమాల అనంతరం రంగరాజన్ తన నివాసానికి చేరుకున్నారు. అయితే రామరాజ్య స్థాపనకు మద్దతు ఇవ్వాలని కోరుతూ కొంతమంది వ్యక్తులు పూజారి ఇంటికి వెళ్లారు. వారిని ఇంట్లోకి ఆహ్వానించిన ఆయన మాటలు కలిపారు. వచ్చిన వారి ప్రవర్తన, మాట తీరు సరిగా లేకపోవడంతో మద్దతు ఇచ్చేందుకు అర్చకుడు నిరాకరించారు. దీంతో అక్కడే ఉన్న రంగరాజన్ కుమారుడిపై నిందితులు దాడికి పాల్పడ్డారు. అనంతరం రంగరాజన్‌పైనా దాడి చేసి తీవ్రంగా కొట్టారు. కాగా, ఘటనపై ఆలయ మేనేజింగ్ కమిటీ ఛైర్మన్ ఎంవీ సౌందర్ రాజన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడి చేసిన వారితోపాటు సహకరించిన వారినీ పట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. వీరరాఘవరెడ్డి అనే వ్యక్తే దాడి చేసినట్లు గుర్తించారు. అనంతరం అతనితోపాటు 20 మంది అనుచరులను సైతం అదుపులోకి తీసుకున్నారు.

## కొహెడలో హైడ్రా కూల్చివేతలు

### అక్రమ కట్టడాలను తొలగించిన హైడ్రా



**అబ్దుల్లాపూర్ మెట్, మహా:** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని కొహెడ గ్రామంలో హైడ్రా ఆదివారం కూల్చివేతలు చేశారు. కొహెడ గ్రామ సర్వే నంబర్ 951, 952 లోని గ్రామపంచాయతీ లేఔట్ లో తమ ప్లాట్లను సమ్మిరెడ్డి బాల్‌రెడ్డి అనే వ్యక్తి ఆక్రమించి రహదారులు లేకుండా అడ్డుగోడలుగా ఫార్మ్ హౌజ్ కట్టాడానికి ప్రయత్నం చేస్తున్నాయని రాధే ధామం లే ఔట్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు పలువురు ప్లాట్ ఓనర్లు హైడ్రాకు ఫిర్యాదు చేయడంతో హైడ్రా చర్యలు తీసుకుంది.కోహెడ గ్రామంలోని సర్వే నెం.951, 952లోని 7.28గుంటలకు సంబధించిన డాక్యుమెంట్స్ పరిశీలించగా 1986లో భూ యజమానులు కె. రాములు, పెద్దయ్య, ఈసయ్య గ్రామ పంచాయతీ లేఔట్ వేసినట్టు నిర్ధారణ చేశారు.ఆ భూమిని సంరెడ్డి బాల్‌రెడ్డి అనే వ్యక్తి స్వాధీనం చేసుకుని, ఫాంహౌస్ నిర్మించడంతో పాటు..లే ఔట్‌లోని పలు ప్లాట్లను సొంతం చేసుకుని... దాని అంతర్గత రహదారులను బ్లాక్ చేసినట్టు తెలిపార. సంబంధిత అన్ని పత్రాలతో హాజరు కావాలని ఇరు పక్షాలకు హైడ్రా నోటీసులు జారీ చేసింది. దీంతో ఈ నెల 8న ఇరు పక్షాలు హాజరు కాగా.. రెవెన్యూ, మున్సిపల్ అధికారుల సమక్షంలో డాక్యుమెంట్స్ పరీలించిన హైడ్రా ఫామ్‌హౌస్, షెడ్, కాంపౌండ్ వాల్, ఫెన్సింగ్ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవని పెద్ద అంబర్ పేట్ మున్సిపల్ అధికారులు తెలిపారు.లే ఔట్ వేసి తమకు ప్లాట్లుగా అమ్మిన తర్వాత సమ్మిరెడ్డి ఈ భూమిని కొన్నట్టు రికార్డులు సృష్టించారని ప్లాట్ ఓనర్ల అససియేషన్ ప్రతినిధుల ఆరోపించారు. ఇరుపక్షాలతో పాటు రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో విచారించిన తర్వాత సమ్మిరెడ్డి బాల్‌రెడ్డి నిర్మించిన ఫాంహౌస్‌తోపాటు అక్కడ నిర్మించిన ప్రహరీ, ఫెన్సింగ్ హైడ్రా అధికారులు పోలీస్ బందోబస్తు నడుమ కూల్చివేశారు. ఇది ఇలా ఉండగా తమది ప్రయివేట్ ల్యాండ్ అని ఎక్కడ కూడా తాము ప్రభుత్వ భూమిని కానీ,కానీ పార్క్ స్థలన్నీ కానీ,చెరువు స్థలం,ఎఫ్టిల్,భఫర్ జోన్ జోలికి కూడా పోలేదని హైడ్రా కట్టడాలను నిబంధనలు ఉలంఘించి కూల్చివేసిందని సంరెడ్డి బాల్ రెడ్డి తెలిపారు.

# బరితెగించిన దొంగలు..!

- చోరి కవరేజీకి వెళ్లిన విలేకరి ఇంటికే కన్నం
- సుమారు 17 తులాల బంగారం, రూ. 5లక్షల నగదు చోరీ
- తాండూరు పట్టణం పాత తాండూరులో ఘటన



**తాండూరు, మహా:** వికారాబాద్ జిల్లా తాండూరులో గుర్తుతెలియని దొంగలు బరితెగించారు. పట్టణంలో ఓ ఇంట్లో జరిగిన చోరీ కవరేజీకి వెళ్లిన విలేకరి ఇంటికే కన్నం వేసి బంగారం, నగదును దోచుకెళ్లిపోయారు. ఈ సంఘటన శనివారం జరిగింది. మున్సిపల్ పరిధి పాత తాండూరుకు చెందిన బస్వరాజ్ గౌడ్ ప్రజాతంత్ర పత్రికలో విలేకరిగా పనిచేస్తున్నారు. ఆయన భార్య అంగన్ వాడి టీచర్ గా పనిచేస్తున్నారు. శనివారం ఎవరి విధులకు వారు వెళ్లారు. అదే సమయంలో పట్టణంలో సాయిపూర్ ప్రాంతంలో ఓ ఇంట్లో దొంగతనం జరిగిందని బస్వరాజ్ కవరేజీ కోసం వెళ్లారు. అక్కడి నుంచి మధ్యాహ్నం ఇంటికి వెళ్లి చూసే సరికి ఇంట్లో వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. లోపలికి వెళ్లి పరిశీలించగా తమ బందువులకు చెందిన సుమారు 7 తులాల బంగారం, వారికి చెందిన మరో 10 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. దీంతో పాటు బంధువులు ఇంట్లో దాచుకున్న రూ. 2లక్షలకు, వారికి చెందిన చీటీ డబ్బులు మరో రూ. 3లక్షలు మొత్తం రూ. 5లక్షల వరకు దొంగలు దోచుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే విషయాన్ని పోలీసులకు తెలపడంతో విషయం తెలుసుకున్న తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐ సంతోష్ కుమార్, ఎస్ఐ రమేష్ లు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలను సేకరించారు. పట్టణంలో ఉదయం, మధ్యాహ్నం మరో చోరీ జరగడంతో పట్టణంలో వరస చోరీలు చర్చనీయాంశంగా మారాయి.

# స్థానిక ఎన్నికలకు సమాయాత్తం కండి

## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళండి

ఏడాది పాలనలో ఎన్నో అమలు చేశాం.. కాంగ్రెస్ శ్రేణులకు మంత్రి సీతక్క పిలుపు



**మహా :** స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ శ్రేణులు సన్నద్ధంగా ఉండాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఏర్పాటు నుండి ఇప్పటి వరకు ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని సూచించారు. నాయకుల కార్యకర్తల మధ్య ఎలాంటి విభేదాలు ఉన్న మా దృష్టికి తీసుకు రావాలని అంతే తప్ప పార్టీ లైన్ దాటితే క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం తథ్యమని హెచ్చరించారు. గోవిందరావుపేటలోని పీఎస్ఆర్ గార్డెన్ లో కార్యకర్తల శమావేశంలో మాట్లాడారు. నాయకులు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని, బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియాలో తప్పడు ప్రచారాలు చేస్తే వెంటనే ఖండించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలములో రైతులకు ఇచ్చిన మాట ప్రకారం 2 లక్షు రైతు రుణమాఫీతో పాటు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సబ్సిడీ, రైతు భరోసా, బీసీ కమిషన్ ఏర్పాటు, కులగణన చేయడం, రైతు కమీషన్, విద్యా కమీషన్, వైశ్య కార్పొరేషన్, రైతు కూలీలకు రైతు భరోసా, సన్న వడ్లకురూ. 500 బోనస్, ఏడాదిలో 55 వేల ఉద్యోగాలు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత డీఎస్సీ వేయడమే కాకుండా ఉద్యోగాలు కూడా ఇచ్చామని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో అభివృద్ధి కోసం సుమారు 15 నుండి 20 కోట్ల రూపాయల నిధులు విడుదల చేశామన్నారు. ఆరోగ్య శ్రీ సేవల కోసం వెయ్యి కోట్లు బిల్లులు చెల్లించామని పేర్కొన్నారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ళు ఇవ్వాలని నిర్ణయించడంతో పాటు స్థలం ఉన్న వారు ఇళ్ళు నిర్మించుకునేందుకు రూ. 5 లక్షల ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- మినీ మేడారం జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి
- స్నాన ఘట్టాలు పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేసిన మంత్రి సీతక్క
- వన దేవతలు శ్రీ సమ్మక్క సారలమ్మ లను దర్శించుకున్న మంత్రి సీతక్క



**ములుగు, మహా :** ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని జరిగే మినీ మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరలో భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. వన దేవతలను ఆదివారం మంత్రి సీతక్క దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం మేడారం సమ్మక్క సారలమ్మ పూజరులతో సమావేశమై మాట్లాడుతూ ఈ నెల 12 నుండి నాలుగు రోజుల పాటు జరిగే మినీ మేడారం జాతరకు 10 నుండి 20 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. నాలుగు రోజులపాటు జరిగే జాతర సందర్భంగా నిరంతరం విద్యుత్ సరఫరా చేయడమే కాకుండా వైద్య సిబ్బంది 24 గంటల పాటు అందుబాటులో ఉంటాయన్నారు. వైద్య శాఖ సిబ్బంది అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలని, అత్యవసర సమయాలలో ఇబ్బందులకు గురయ్యే వారిని జిల్లా కేంద్రానికి తరలించడానికి వాహనాలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. గద్దెల ప్రాంతంలో క్యూలైన్ల వద్ద తొక్కిసలాట జరగకుండా, చోరీలు సంఘటన జరగకుండా పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, జంపన్న వాగు, గద్దెల ప్రాంతం, మేడారం పరిసర ప్రాంతాలలో పారిశుధ్య కార్మికులచే నిరంతరం శుభ్రంచేయించాలన్నారు. భారీ సంఖ్యలో వాహనాలు వచ్చిన పక్షంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాలలో వాహనాలు నిలిపే విధంగా చర్యలు తీసుకునేలా పోలీస్ శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంత్రి సీతక్క అన్నారు. ప్రస్తుతం ఎండలు మండిపోతున్న సందర్భంగా గద్దెల ప్రాంతంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చలువ పందిర్లను ఏర్పాట్లు చేశామని, దాదాపు 5 కోట్ల 30 లక్షల రూపాయలతో వివిధ పనులను పూర్తి చేయడం జరిగిందని పేర్కొన్నారు. జాతరను పురస్కరించుకొని పలుచోట్ల ప్రత్యేకంగా మరుగుదొడ్లను ఏర్పాటు చేశామని, త్రాగునీటి కొరత ఏర్పడకుండా నిరంతరం నీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. నాలుగు రోజుల పాటు జరిగే జాతరను పురస్కరించుకొని ఆర్టీసీ అధికారులు హనుమకొండ జిల్లా కేంద్రం నుండి నిరంతరం బస్సులను మేడారం నడిపించనున్నారని, జాతరకు వచ్చే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వర్తిస్తుందని తెలిపారు. అమ్మవార్లను దర్శించుకోవడానికి వచ్చే భక్తులు తమ మొక్కులను చెల్లించుకొని సురక్షితంగా తిరుగు ప్రయాణం కావాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవి చందర్ తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు పూజారులు తదితరులు పాల్గొన్నారు.




## యూట్యూబర్‌పై సెబీ కన్నెర్ర.. ఎవరీ అస్మితా పటేల్?



సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా ఆరు సంస్థలను నిషేధించింది. రిజిస్ట్రేషన్ లేకుండా ఇన్వెస్ట్‌మెంట్ సలహాలు ఇచ్చి, కోర్సులు నిర్వహించి పెట్టుబడిదారుల నుంచి డబ్బులు సేకరించిన కారణంగానే సెబీ ఈ నిర్ణయం తీసుకుంది. ఇందులో గ్లోబల్ స్కూల్ ఆఫ్ ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ 'అస్మితా పటేల్' కూడా ఉన్నారు. అస్మితా పటేల్ పెట్టుబడికి సంబంధించిన టిప్స్ చెబుతూ.. కోర్సులు నేర్చుకునే వారి దగ్గర నుంచి భారీగానే వసూలు చేసింది. ఈమె టిప్స్ విన్న పెట్టుబడిదారులు నష్టాలను చవిచూశారు. దీంతో చాలామంది ఇన్వెస్టర్లు వరుసగా ఫిర్యాదులు చేయడం మొదలు పెట్టారు. దీంతో సెబీ రంగంలోకి దిగింది. టిప్స్ పేరుతో అస్మితా పటేల్ సుమారు రూ. 104 కోట్ల కంటే ఎక్కువ సంపాదించినట్లు సమాచారం. ఈ విషయాలు సెబీ విచారణలో తేలాయి. కోర్సు ఫీజుల కింద ఇన్వెస్టర్లు, స్టూడెంట్స్ నుంచి సేకరించిన రూ.53 కోట్లు.. సంబంధిత ఇన్వెస్టర్లకు తిరిగి ఇచ్చేయాలని సెబీ ఆదేశించింది. అస్మితా పటేల్ నిర్వహిస్తున్న యూట్యూబ్ ఛానెల్‌కు 5.26 లక్షల సబ్‌స్క్రైబర్లు ఉన్నట్లు సమాచారం. అంతే కాకుండా ఈమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో 2.9 లక్షల మంది ఫాలోవర్లు, ఫేస్‌బుక్‌లో 73,000 మంది, లింక్డ్‌ఇన్‌లో 1,900 మంది ఫాలోవర్లు, ఎక్స్ (ట్విటర్)లో 4,200 మంది ఫాలోవర్లు ఉన్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, లింక్డ్‌ఇన్, ఎక్స్ (ట్విటర్)లలో కూడా భారీ ఫాలోయింగ్ ఉంది. యూట్యూబర్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్.. అస్మితా పటేల్ తనను తాను షీవోల్ఫ్ ఆఫ్ ది స్టాక్ మార్కెట్.. 'ఆప్షన్స్ క్వీన్'గా ప్రచారం చేసుకుంటోంది.



ఈమె దాదాపు ఒక లక్షమంది స్టూడెంట్లకు, పెట్టుబడిదారులకు ట్రేడింగ్ సలహాలు ఇచ్చినట్లు సమాచారం.

### ఎవరీ అస్మితా పటేల్?

అస్మితా పటేల్.. మహారాష్ట్రలోని నవీ ముంబైలో ఉన్న అస్మితా పటేల్ గ్లోబల్ స్కూల్ ఆఫ్ ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (AGSTPL)కి డైరెక్టర్. కంపెనీ వెబ్‌సైట్ ప్రకారం.. ఆమె సాంప్రదాయ గుజరాతీ కుటుంబంలో జన్మించింది. ఈమెకు 17 సంవత్సరాల ట్రేడింగ్ ఎక్స్‌పీరియన్స్, పదేళ్లకు పైగా బోధనా నైపుణ్యం ఉందని తెలుస్తోంది. అంతే కాకుండా అనేక అవార్డులను గెలుచుకున్నట్లు చెబుతున్నారు.

## 5జీ కోసం బీఎస్ఎన్ఎల్ ప్లాన్: జియోకు పోటీ!?

భారతదేశంలో జియో, ఎయిర్‌టెల్ వంటి టెలికాం ఆపరేటర్లు ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. వీటికి గట్టి పోటీ ఇవ్వడానికి, యూజర్లకు మెరుగైన సేవలు అందించడానికి 'భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్' (BSNL) సిద్ధమైంది. దేశంలో నాల్గవ అతిపెద్ద టెలికాం ఆపరేటర్.. 'బీఎస్ఎన్ఎల్' దేశవ్యాప్తంగా మెరుగైన సేవలను అందించడానికి తన నెట్‌వర్క్‌ను వేగంగా విస్తరిస్తోంది. ఈ కంపెనీ ఇప్పటికే 65,000 4జీ సైట్‌లను ఏర్పాటు చేసింది. ఇటీవల కేరళలో కూడా 5,000 కొత్త సైట్‌లను జోడించింది. కంపెనీ దేశం అంతటా మొత్తం ఒక లక్ష 4G సైట్‌లను చేరుకోవడమే లక్ష్యంగా కృషి చేస్తోంది. బీఎస్ఎన్ఎల్ ప్రపంచంలోనే అత్యంత సరసమైన 4G టారిఫ్‌లను అందించడంలో ప్రసిద్ధి చెందింది. అయితే కనెక్టివిటీని మెరుగుపరచడానికి, కంపెనీ వివిధ ప్రాంతాలలో కొత్త సైట్ ఇన్‌స్టాలేషన్‌లను చురుకుగా ప్లాన్ చేస్తోంది. కంపెనీ ఒక లక్ష 4జీ సైట్ లక్ష్యాన్ని పూర్తి చేసిన తర్వాత.. 5G నెట్‌వర్క్‌ను ప్రారంభించనున్నట్లు సమాచారం. బీఎస్ఎన్ఎల్ తన 4జీ నెట్‌వర్క్‌ను 5జీకి అప్‌గ్రేడ్ చేయడానికి.. 'టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్' (TCS) సహకరిస్తోంది. కంపెనీ తన ప్రస్తుత 4జీ మౌలిక సదుపాయాలను సాఫ్ట్‌వేర్ అప్డేట్స్ ద్వారా 5జీగా మార్చాలని యోచిస్తోంది. ఎయిర్‌టెల్ మాదిరిగానే కంపెనీ భారతదేశం అంతటా 5జీ నాన్ స్టాండలోన్ (NSA) టెక్నాలజీని కూడా విడుదల చేయడానికి యోచిస్తోంది. బీఎస్ఎన్ఎల్ 5జీ స్టాండలోన్ (SA) టెక్నాలజీని పరీక్షిస్తోంది. ప్రస్తుతం ఢిల్లీలో 5G SA టెస్టింగ్ జరుగుతోంది. ఇవన్నీ సవ్యంగా జరిగితే.. ఇంటర్నెట్ సేవలు మరింత చౌకగా లభిస్తాయి. ఇదే జరిగితే జియో, ఎయిర్‌టెల్ యూజర్లు కూడా బీఎస్ఎన్ఎల్ వైపు తిరిగే అవకాశం ఉంది. మొత్తం మీద కంపెనీ తన నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడంలో మాత్రమే కాకుండా.. దేశవ్యాప్తంగా వినియోగదారులకు వేగవంతమైన కనెక్టివిటీని తీసుకురావడానికి కృషి చేస్తోంది.




## టెక్నాలజీ అద్భుతం.. ఎగిరే ఓడ చూశారా?



ఇప్పటికే ఎగిరే కార్లు వచ్చేశాయి. వాటి వరుసలోనే తాజాగా ఎగిరే ఓడలు కూడా వచ్చేశాయి. సముద్రం మీదుగా రవాణా చేయటానికి ఉపయోగించే ఓడలు, ఇప్పుడు గాలిలో ఎగురుతూ ప్రయాణం చేస్తాయి. ది ఫ్లయింగ్ షిప్ కంపెనీ వింగ్‌టిప్స్ రూపొందించిన ఈ ఎగిరే ఓడ సాధారణమైన ఓడల కంటే పదిరెట్లు వేగంగా ప్రయాణిస్తుంది. హోవర్ ఇంజిన్లతో తయారుచేసిన ఈ ఓడ బ్యాటరీలతో పనిచేస్తుంది. ఒకేసారి మొత్తం 22 కిలోల బరువు వరకు సరుకు రవాణా చేయగలదు. ఇక దీనికున్న పది అడుగుల పొడవైన రెక్కల సాయంతో, ఈ నౌక దాదాపు సముద్రంపై నుంచి 80 కిలోమీటర్ల పరిధి మేరకు ఎగురుతుంది. ఇది గంటకు గరిష్ఠంగా 19 నుంచి 27 మైళ్ల (సుమారు 30 కిలోమీటర్ల నుంచి 43 కిలోమీటర్ల) వేగంతో ప్రయాణిస్తుంది. దీనిని ప్రధానంగా సరుకుల రవాణా కోసం రూపొందించినట్లు కంపెనీ తెలిపింది. త్వరలోనే ఈ ఎగిరే ఓడల్లో మరో రెండు మోడల్స్‌ను విడుదల చేయనున్నట్లు సమాచారం.

## టెస్లా బాస్ చేతికి టిక్‌టాక్?: మస్క్ ఏం చెప్పారంటే..

ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాల్లో అధిక ప్రజాదరణ పొందిన చైనా షార్ట్ వీడియో యాప్ టిక్‌టాక్ ను ఇప్పటికే భారత్‌తో సహా చాలా దేశాలు నిషేధించాయి. అమెరికా కూడా ఈ యాప్‌ను నిషేదించనున్నట్లు సమాచారం. కానీ దీనిని ఇలాన్ మస్క్ కొనుగోలు చేయనున్నట్లు కొన్ని వార్తలు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. ఇందులో నిజమెంత?.. దీనిపై మస్క్ అభిప్రాయం ఏంటనేది ఇక్కడ చూసేద్దాం. భద్రతా కారణాల దృష్ట్యా.. టిక్‌టాక్ యాప్‌ను అమెరికా నిషేధించాలని యోచిస్తోంది. ఈ నిషేధం నుంచి తప్పించుకోవడానికి.. టిక్‌టాక్ మాతృ సంస్థ బైట్‌డ్యాన్స్ ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత మస్క్‌కు విక్రయించాలని ప్లాన్ వేస్తున్నట్లు సమాచారం. దీనిపై మస్క్ స్పందించారు. నేను టిక్‌టాక్ కొనుగోలుకు బిడ్డింగ్ వేయలేదు. దానిని కొనుగోలు చేయాలనే ఆసక్తి నాకు లేదు. ఒకవేళ ఆ యాప్ కొనుగోలు చేస్తే దానిని ఏమి చేయాలో తెలియదు. కంపెనీలను కొనుగోలు చేయడం కంటే.. కొత్త కంపెనీలను నెలకొల్పడమే నాకు ఇష్టం అని మస్క్ స్పష్టం చేశారు. 2017లో ప్రారంభమైన టిక్‌టాక్, అతి తక్కువ కాలంలోనే బాగా పాపులర్ అయింది. ఎంత వేగంగా ప్రజాదరణ పొందిందో.. అంతే వేగంగా ఈ యాప్‌ను పలు దేశాలు రద్దు చేశాయి. అమెరికా కూడా ఈ యాప్‌పై ఆంక్షలు విధించింది. చైనా యాజమాన్యాన్ని వదులుకోకపోతే టిక్‌టాక్ నిషేధాన్ని ఎదుర్కోక తప్పదనే బిల్లుకు అమెరికా ప్రతినిధుల సభ ఇటీవల ఆమోదం తెలిపింది. అమెరికా ప్రతినిధుల సభ ఆమోదం.. తరువాత అమెరికా సుప్రీంకోర్టు కూడా టిక్‌టాక్ మాతృసంస్థ బైట్‌డ్యాన్స్‌కు ఓ డెడ్‌లైన్ ఇచ్చింది. ట్రంప్ అధికారంలోకి వచ్చిన 75 రోజుల్లో టిక్‌టాక్‌ను విక్రయించాలని సూచించింది.




# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

## మహా జామ్.. కుంభమేళాకు కోటిన్నర

### ట్రాఫిక్ లోనే 48గంటలు.. సండే.. పోటెత్తిన భక్తజనం



**మహా:** కుంభమేళాకు వెళ్లే వాహనాలతో ప్రయాగ్‌రాజ్ దారులన్నీ కిక్కిరిసిపోతున్నాయి. ప్రయాగ్‌రాజ్‌కాన్పుర్, ప్రయాగ్‌రాజ్‌లఖ్‌నవూప్రతాప్‌గఢ్, ప్రయాగ్‌రాజ్‌వారణాసిమిర్జాపుర్, ప్రయాగ్‌రాజ్‌రేవా వెళ్లే జాతీయ రహదారుల్లో మూడు రోజులుగా విపరీతమైన రద్దీ కొనసాగుతోంది. 48 గంటలుగా ట్రాఫిక్‌లోనే చిక్కుకున్నట్లు అనేక మంది ప్రయాణికులు పేర్కొంటున్నారు. 50 కి.మీ మేర దూరానికే 10 నుంచి 12గంటల సమయం పడుతుందని వాపోతున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. ప్రయాగ్‌రాజ్‌కు వెళ్తున్న వాహనాల రద్దీ దృష్ట్యా.. ఆదివారం నాడు మధ్యప్రదేశ్ పరిధిలోని అనేక జిల్లాల్లో ట్రాఫిక్‌ను ఎక్కడికక్కడే నిలిపివేశారు.ఆదివారం సాయంత్రం నాలుగు గంటల వరకే సుమారు కోటి 41లక్షల మంది పుణ్య స్నానాలు ఆచరించినట్లు అంచనా. దీంతో ఇప్పటివరకు మొత్తంగా 42కోట్ల మందికి పైగా ప్రయాగ్‌రాజ్‌ను దర్శించినట్లు యూపీ ప్రభుత్వం వెల్లడించింది.



## జై జనసేన

### నినదించిన మెగాస్టార్ చిరంజీవి

నాటి ప్రజారాజ్యమే.. నేటి జనసేనగా రూపాంతరం

సినిమా వేడుకలో సంచలన వ్యాఖ్యలు

తెలుగు రాజకీయాల్లో హీట్

**హైదరాబాద్, మహా:** జనసేన విజయాలపై మెగాస్టార్ చిరంజీవి గర్వంగా పొంగిపోతున్నాడు. జై జనసేన అంటూ నినదించారు. నాటి ప్రజారాజ్యపార్టీనే నేటి జనసేనగా రూపాంతరం చెందిందంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో సరికొత్త ప్రకంపనలు తీసుకొచ్చారు. లైలా మూవీ ప్రీరిలీజ్ ఈవెంట్‌లో మెగాస్టార్ చిరంజీవి హాట్ కామెంట్స్ చేశారు. చాలా రోజుల తర్వాత ప్రజారాజ్యం పార్టీ ప్రస్తావన తీసుకొచ్చారు. ఫంక్షన్‌కు వచ్చిన అభిమానులంతా జై జనసేన అంటూ నినాదాలు చేయడంతో ఆయన కూడా.. జై జనసేన అంటూ నినదించారు. మెగాస్టార్ నోట జై జనసేన అని అనడం ఇదే ఫస్ట్ టైమ్. నాటి ప్రజారాజ్యం పార్టీనే రూపాంతరం చెంది.. జనసేనగా మారిందంటూ మెగాస్టార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దీంతో మెగా అభిమానులంతా హర్షం వ్యక్తం చేశారు.

### నాడు ప్రభంజనం

2008 ఆగష్టు 26న చిరంజీవి ప్రజారాజ్యం అనే పార్టీని స్థాపించాడు. ఆ తర్వాత 2009లో జరిగిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సాధారణ శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసిన 294 స్థానాలకు గాను 18 స్థానాలు గెలుచుకుంది. మొత్తం ఓట్లలో 18% ఓట్లు ఈ పార్టీ దక్కించుకుంది. పార్టీ అధ్యక్షుడు చిరంజీవి తిరుపతి, పాలకొల్లు నియోజకవర్గాల నుండి పోటీ చేయగా తిరుపతి స్థానం నుండి గెలుపొందాడు. ఆగష్టు 2011లో భారత జాతీయ కాంగ్రెసు పార్టీలో విలీనం చేశారు. అప్పటినుంచి ఇప్పటివరకు అక్కడక్కడ పవన్ కల్యాణ్ తప్ప చిరంజీవి ఎప్పుడూ మళ్లీ ప్రజారాజ్యం పార్టీ ప్రస్తావన తీసుకురాలేదు. అనూహ్యంగా లైలా వేడుకలో మళ్లీ ప్రజారాజ్యమే జనసేనగా రూపాంతరం చెందిందని మాట్లాడటంతో ఫ్యాన్స్ సంతోషపడుతున్నారు.

## ఇంకో ఎన్నిక ఉంది పుష్పా

### డబుల్ ఇంజన్ కాదు ట్రిపుల్ ఇంజన్




**న్యూఢిల్లీ, మహా :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన బీజేపీకి ఆ సంతోషంలో ఉండగానే.. ఇంకో ఎన్నిక ఉంది పుష్పా అని గుర్తుచేస్తోంది ఢిల్లీ. మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ మేయర్ ఎన్నికలు ఈఏడాది ఏప్రిల్‌లో జరగాల్సి ఉన్నాయి. మున్సిపల్ స్థాయిలోనూ బీజేపీ గెలుపు సాధిస్తే డబుల్ కాదు.. 'ట్రిపుల్ ఇంజన్' ప్రభుత్వం బీజేపీ ఏలుబడిలోకి వచ్చినట్టవుతుంది. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ఇప్పుడు ఎంసీడీ ఎన్నికల్లోనూ పట్టు సాధించాలని ఆశిస్తోంది. ఎంసీడీలో ఎన్నికైన కౌన్సిలర్లు 250 మంది ఉంటారు. అదనంగా, ఏడుగురు ఢిల్లీ ఎంపీలు, ముగ్గురు రాజ్యసభ ఎంపీలు, 14 మంది ఎమ్మెల్యేలు కూడా మేయర్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకుంటారు. ప్రస్తుతం బీజేపీకి 120 మంది కౌన్సిలర్లు ఉండగా, ఆమ్ ఆద్మీ పార్టీకి 122 మంది కౌన్సిలర్లు ఉన్నారు. అయితే, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 8 మంది బీజేపీ కౌన్సిలర్లు పోటీచేశారు. అందరూ ఎమ్మెల్యే సీట్లు గెలిచారు. ఆప్ నుంచి కూడా ముగ్గురు కౌన్సిలర్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. అసెంబ్లీ స్థానాల్లో గెలిచిన బీజేపీ కౌన్సిలర్లలో గజేంద్ర ద్రాల్ (ముండ్కా), రేఖా గుప్తా (షాలిమార్ బాగ్), పూనమ్ శర్మ (వజీపూర్), నీలం పెహల్వాన్ (నజఫ్‌గఢ్), ఉమాంగ్ బజాజ్ (రాజేంద్ర నగర్), చందన్ చౌదరి (సంగమ్ విహార్), రవీంద్ర సింగ్ నెగి (పట్పర్‌గంజ్), షిఖా రాయ్ (గ్రేటర్ కైలాష్) ఉన్నారు. బీజేపీ నామినేటెడ్ కౌన్సిలర్ రాజ్‌కుమార్ భాటియా కూడా అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచారు. అయితే, నామినేటెడ్ కౌన్సిలర్లు మేయర్ ఎన్నికల్లో ఓటు వేయడానికి అనర్హులు. జోనల్ ఎన్నికల్లో మాత్రం పాల్గొనవచ్చు. బీజేపీకి ఈ ఎన్నికల్లో కలిసొచ్చే మరో విషయం కూడా ఉంది. ఆ పార్టీ మాజీ కౌన్సిలర్ కమల్‌జీత్ షెరావత్ ప్రస్తుతం వెస్ట్ ఢిల్లీ ఎంపీగా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో ఎంసీడీలో 12 కౌన్సిల్ సీట్లు ఖాళీ అయ్యాయి. వీటికి ఉపఎన్నికలు జరగాల్సి ఉంటుంది. లెఫ్టినెంట్ గవర్నర్ ఒక కౌన్సిలర్‌ను నామిటేడ్ చేస్తారు. ప్రస్తుతం బీజేపీ కౌన్సిలర్ల బలం 112 కాగా, ఆప్‌కు 119 మంది ఉన్నారు. చివరిసారిగా ఐదు నెలల కాలవ్యవధికి ఎంసీడీ మేయర్ ఎలక్షన్లు 2024 నవంబర్‌లో జరిగాయి. కాగా, ఈసారి జరగబోయే మేయర్ ఎన్నికల్లో బీజేపీ నుంచి 14 మంది ఎమ్మెల్యేలు, ఏడుగురు ఎంపీలు ఓటింగ్ అర్హత పొందారు. దీంతో ఏప్రిల్ ఎన్నికల్లో మేయర్ సీటు గెలుచుకునే అవకాశాలు బీజేపీకి బలంగా ఉన్నాయి.

## అవిశ్వాసానికి సిద్ధమైన వేళ

## మణిపూర్ సీఎం రాజీనామా

### అల్లర్లను అదుపు చేయడంలో విఫలమైన బీరేన్ సింగ్

### శనివారం అమిత్ షా భేటీలోనే నిర్ణయం



**మహా :** మణిపూర్ ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ తన పదవికి రాజీనామా చేశారు. ఆదివారం తన రాజీనామా లేఖను రాష్ట్ర గవర్నర్ అజయ్ భల్లాకు ఆయన అందజేశారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో శనివారం సీఎం బీరెన్ సింగ్ సమావేశమయ్యారు. అనంతరం బీరెన్ సింగ్ ఈ నిర్ణయం తీసుకున్నారు. కొంత కాలంగా మణిపూర్‌లో అల్లర్లు జరుగుతున్నాయి. దీంతో సీఎం బీరెన్ సింగ్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. 2023, మేలో ఈశాన్య రాష్ట్రాల్లో ఒకటైన మణిపూర్‌లో రెండు తెగలు మైతేయి, కూకీ మధ్య ఘర్షణలు చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో దాదాపు 300 మంది మరణించారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. లక్షలాది మంది ప్రాణ భయంతో ఇతర ప్రాంతాలకు తరలిపోయారు. ఆ నాటి నుంచి రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితులు పూర్తిగా క్షీణించాయి. అలాంటి వేళ ఆ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీరెన్ సింగ్ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు సైతం వెల్లువెత్తాయి. అనంతరం ఆ ప్రభుత్వానికి పలు పార్టీలు తమ మద్దతును ఉపసంహరించుకొన్నాయి. అయినా మణిపూర్‌లో బీజేపీకి ఎమ్మెల్యేల సంఖ్య బలం బాగానే ఉంది. దీంతో ఆ పార్టీ అధికారంలో కొనసాగుతోంది. అయితే ముఖ్యమంత్రి బీరెన్ సింగ్‌ను మార్చాలంటూ ఆ పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఇప్పటికే న్యూఢిల్లీలోని అగ్రనాయకత్వానికి వరుస లేఖలు సంధించారు. అదీకాక మణిపూర్‌లో హింస చెలరేగడంతో ఆ రాష్ట్రంలో లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సైతం పర్యటించారు. స్థానికులతో ఆయన మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి పూర్తిగా క్షీణించిందంటూ ఈ నేపథ్యంలో మణిపూర్‌లో పర్యటించి ఆ రాష్ట్ర ప్రజలకు భరోసా ఇవ్వాలంటూ ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ సూచించిన సంగతి తెలిసిందే. మరోవైపు బీరెన్ సింగ్‌పై సోమవారం అసెంబ్లీలో అవిశ్వాసం పెట్టేందుకు రంగం సిద్ధమైంది. అలాంటి వేళ బీరెన్ సింగ్ తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు.

# హీరోయిన్‌గా ఛాన్స్..

## రూ. 6 కోట్లు మోసపోయిన మాజీ సీఎం కూతురు

సినిమా అవకాశాల పేరుతో చాలామంది మోసపోతూ ఉంటారు. పలు నిర్మాణ సంస్థల పేర్లు చెప్పకొని అమాయకులను ట్రాప్ చేసి తమ బుట్టలో వేసుకుంటారు. ఆపై వారి టార్గెట్ రీచ్ అయిన తర్వాత ఉడాయించేస్తారు. ఇలాంటి ఘటనలు సమాజంలో ఎన్నో జరుగుతుంటాయి. అయితే, సినిమా ఛాన్సుల పేరుతో తనను మోసం చేశారని ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మాజీ మంత్రి రమేశ్ పోఖ్రియాల్ నిషాంక్ కుమార్తె ఆరుషి నిషాంక్ ఫిర్యాదు చేశారు. ముంబైకి చెందిన మాన్సి వరుణ్ బాగ్లా, వరుణ్ ప్రమోద్ కుమార్ బాగ్లాపై డెహ్రాడూన్ నగర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆరుషి నిశాంక్ ఇప్పటికే కొన్ని వెబ్ సిరీస్‌లలో నటించారు. ఆమె ఒక క్లాసికల్ డ్యాన్సర్, నటి, నిర్మాత, మోడల్ కూడా.. సినిమాలపై మక్కువతో ఆమె ఒక నిర్మాణ సంస్థను కూడా ఏర్పాటు చేసుకుంది. ఆయితే, ఆమెకు సినిమాల్లో హీరోయిన్‌గా రాణించాలనే కోరిక ఉంది. దానిని ఆసరా చేసుకున్న ఇద్దరు కేటుగాళ్లు ఒకరోజు డెహ్రాడూన్‌లోని ఆమె ఇంటికి వెళ్లి తమను తాము సినిమా నిర్మాతలమని పరిచయం చేసుకున్నారు. మినీ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ద్వారా కొత్త సినిమాలు తెరకెక్కిస్తున్నామని ఆమెతో తెలిపారు. షానయా కపూర్, విక్రమ్ మాస్సేతో ఒక సినిమా తీస్తున్నామని ఆమెతో చెప్పారు. ఈ మూవీలో హీరోయిన్ పాత్ర చాలా బలంగా ఉంటుందని, నటించే వారికి స్టార్‌డమ్ వస్తుందని నమ్మబలికారు. అయితే, సినిమా కోసం రూ. 5 కోట్లు పెట్టుబడి పెట్టాలని ఆమెను నమ్మించారు. ఆపై హీరోయిన్‌గా నటించే ఛాన్స్ కూడా దక్కుతుందని ఆమెకు ఆఫర్ ఇచ్చారు. ఒకవేళ మీకు ఆ పాత్ర నచ్చకపోతే రూ. 5 కోట్లకు గాను ఏడాదికి 20 శాతం వడ్డీతో కలిపి ఇస్తామని, రెండు నిర్మాణ సంస్థల పేరు మీద సినిమా తీస్తామని ఆమెని నమ్మించారు. ఆ కేటుగాళ్ల మాటలను నమ్మిన ఆరుషి నిశాంక్.. సంయుక్తంగా సినిమా నిర్మిందామని వారికి రూ. 4 కోట్లు అప్పజెప్పింది. అయితే, కొన్ని రోజుల తర్వాత, వివిధ రకాల కారణాలతో ఎంఓయూ నిబంధనలకు విరుద్ధంగా, గతేడాది అక్టోబర్ 27న మరో రూ.25 లక్షలు, అక్టోబర్ 30న రూ.75 లక్షలు, నవంబర్ 19న కోటి రూపాయలు తీసుకున్నారు. అయితే, రోజులు గడుస్తున్నాయి. సినిమా పనులు ఎంతవరకు వచ్చాయని ఆమె ప్రశ్నించింది. దీంతో కొన్ని నకిలీ ఫోటోలను ప్రచురించి పంపిణీ చేశారు. కొత్త హీరోయిన్‌ను తీసుకున్నామని నమ్మబలికారు. వారి మోసాన్ని పసిగట్టిన ఆరుషి.. తన డబ్బు తిరిగి ఇవ్వాలని కోరడంతో ఆమెను చంపుతామని బెదిరించారు. ఆపై ఆమె పరువు తీస్తామని హెచ్చరించారు. ఆరుషి ఫిర్యాదుతో పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సినిమా అవకాశం పేరుతో రూ. 6 కోట్లు సమర్పించుకున్న ఆరుషిపై నెటిజన్లు మండిపడుతున్నారు. అంత డబ్బు చేతిలో ఉండగా నువ్వే సొంతంగా సినిమా నిర్మించవచ్చు కదా అంటూ ఫైర్ అవుతున్నారు.



# అల్లు అర్జున్‌తో నో..

## ఎన్టీఆర్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన బాలీవుడ్ బ్యూటీ

బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధా కపూర్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. స్త్రీ 2 సినిమాతో ఇండియన్ బాక్సాఫీస్ వద్ద సుమారు రూ. 500 కోట్లకు పైగా కలెక్షన్స్ రాబట్టి రికార్డ్ క్రియేట్ చేసిన ఈ బ్యూటీ ఇప్పుడు ఐటమ్ సాంగ్‌కు గ్రీన్ ఇచ్చేసిందట. చిత్రపరిశ్రమలో భారీ క్రేజ్ ఉన్న ఆమెకు ఐటమ్ సాంగ్స్‌లో నటించమని ఇప్పటికే భారీ ఆఫర్స్ వచ్చాయి. కానీ, ఆమె సున్నితంగానే వాటికి నో చెప్పింది. అయితే.. ఎన్టీఆర్, హృతిక్ రోషన్ బాలీవుడ్ మూవీ వార్ 2లో ఆమె స్టెప్పులు వేయనుందని తెలుస్తోంది. 'సాహో'తో తెలుగు వారికి పరిచయమైన శ్రద్ధా కపూర్‌కు టాలీవుడ్‌లో కూడా భారీగానే అభిమానులు ఉన్నారు. ఈ క్రమంలో ఆమె మంచి డ్యాన్సర్ కూడా.. అయితే, 'పుష్ప 2'లో ప్రత్యేక పాట కోసం చిత్ర యూనిట్ ఆమెను సంప్రదించినట్లు టాలీవుడ్‌లో ప్రచారం జరిగింది. రెమ్యునరేషన్ విషయంలో డీల్ సెట్ కాకపోవడంతో ఆమె నో చెప్పారని కూడ వార్తలు వచ్చాయి. ఫైనల్‌గా ఆ ఛాన్స్ శ్రీలీల దక్కించుకుంది. ఇప్పుడు వార్ 2 సినిమాలో శ్రద్ధా కపూర్ ఒక ఐటమ్ సాంగ్‌లో కనిపించనుందని గట్టిగానే వినిపిస్తుంది. ఇందులో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తుంది. స్పై యాక్షన్ థ్రిల్లర్‌ను అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ కూడా చాలా స్పీడ్‌గా జరుగుతోంది. అల్లు అర్జున్ పుష్ప 2 చిత్రానికి నో చెప్పిన శ్రద్ధా కపూర్.. ఎన్టీఆర్, హృతిక్‌తో కలిసి స్టెప్పులు వేయబోతున్నట్లు తెలుస్తోంది. ఇదే నిజమైతే సినీప్రియుల్ని ఉర్రూతలూగించేలా ఆ సాంగ్ ఉంటుందని ఫ్యాన్స్ సంబరపడుతున్నారు. త్వరలో ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించే ఛాన్స్ ఉందని శ్రద్ధ సన్నిహిత వర్గాలు తెలిపాయి.





ఒకప్పుడు ఫ్రెండ్ దగ్గర రూ.15,000 అప్పు తీసుకున్నాడు..

# ఇప్పుడు రూ.3,000 కోట్ల ఆస్తి ఉన్న స్టార్ యాక్టర్

ప్రపంచ దేశాల్లో బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ గురించి తెలియని వారు చాలా తక్కువ మంది ఉంటారు. ఇప్పుడు చాలా మంది హీరోలు వందల కోట్ల కలెక్షన్స్ సాధిస్తున్నారు. కానీ సల్మాన్ ఖాన్.. ఎప్పుడో ఈ ట్రెండ్ స్టార్ట్ చేశాడు. అతని సినిమా వస్తోందంటే చాలు.. రిలీజ్ అయిన 2, 3 రోజుల్లోనే వంద కోట్లు వచ్చి పడేవి. ఇప్పుడు వందల కోట్లు వస్తున్నాయి. ఐతే.. తాజాగా సల్మాన్ ఖాన్.. ఒక పాడ్ కాస్ట్‌లో ఎవరికీ తెలియని విషయాలు చెప్పాడు. తన మేనల్లుడు అర్హాన్ ఖాన్‌కి చెందిన యూట్యూబ్ ఛానెల్ ధమ్ బిర్యానీలో తొలిసారి పాడ్ కాస్ట్ చేశాడు సల్మాన్ ఖాన్. అందులో అర్హాన్‌తోపాటూ.. అతని ఫ్రెండ్స్ దేవ్ రయ్యానీ, ఆరుష్ శర్మ కూడా.. సల్మాన్‌తో ముచ్చట్లు పెట్టారు. ఈ పాడ్‌కాస్ట్‌లో సల్మాన్.. తన జీవితంలోని వేర్వేరు కోణాలను బయటపెట్టాడు. స్నేహం అనేది ఎంత గొప్పదో సల్మాన్ వివరించాడు. చుట్టూ మనకంటూ కొంతమంది స్నేహితులు ఉంటే.. ఆ జీవితం చాలా బాగుంటుందని తెలిపాడు. "నాకు చాలా మంది ఫ్రెండ్స్ ఉన్నారు. ఇప్పటికీ నాతో ఉన్నారు. నువ్వు కూడా నీ స్నేహితులతో సాధించాల్సింది ఇదే. నేను వాళ్లను తరచూ చూడను. కానీ ఎప్పుడైతే మేము కలుస్తామో, అప్పుడు మా మధ్య బంధం అలాగే ఉంటుంది. మేమంతా ఒకేలా కనెక్ట్ అవుతాం. ఎప్పుడైనా ఏదైనా అవసరం అయితే, మేమంతా టచ్‌లోనే ఉంటాం" అని సల్మాన్ చెప్పాడు. ఈ సందర్భంగా సల్మాన్ ఖాన్ తన తొలి రోజుల్లో అనుభవాన్ని పాడ్‌కాస్ట్‌లో చెప్పాడు. షో బిజినెస్ టైంలో సల్మాన్ ఆర్థికంగా బలంగా లేడు. "మైనే ప్యార్ కియా రోజుల్లో నాకో స్నేహితుడు ఉండేవాడు. నేను సానమ్ బేవఫా చేస్తున్నప్పుడు తను నాకు రూ.15,000 ఇచ్చాడు. అప్పట్లో రూ.15వేలంటే చాలా ఎక్కువ. మేము అప్పుడు మనాలీలో ఉన్నాం. షాపింగ్ చేశాం. నాకు ఒకటి నచ్చింది. కానీ కొనడానికి డబ్బు లేదు. వెంటనే తను మనీ ఇచ్చాడు. అప్పటి నుంచి మేము ఎప్పటికీ స్నేహితులుగా ఉన్నాం" అని సల్మాన్ ఖాన్ తెలిపాడు.

క్రీడా వార్తలు | SPORTS NEWS

# కటక్ వన్డేలో భారత్ ఘన విజయం

## 4 వికెట్ల తేడాతో ఇంగ్లాండ్‌పై భారత్ గెలుపు

### స్కోర్లు: ఇంగ్లాండ్ ఆలౌట్, భారత్ 308/6.. 3 వన్డేల సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకున్న భారత్



**కటక్:** ఇంగ్లండ్‌తో కటక్ వేదికగా జరిగిన రెండో వన్డేలో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ చెలరేగి ఆడి జట్టుకు ఘన విజయాన్ని అందించాడు. ఇంగ్లండ్ నిర్దేశించిన 305 పరుగుల లక్ష్య ఛేదనలో టీమిండియా 44.3 ఓవర్లలోనే ఆరు వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. రోహిత్ శర్మ వీరవిహారంతో టీమిండియా అవలీలగా విజయం సాధించింది. ఫలితంగా సిరీస్‌ను 20 తేడాతో ఇంకో మ్యాచ్ ఉండగానే కైవసం చేసుకుంది టీమిండియా.

**హిట్‌మ్యాన్ సూపర్ షో..**

చాలాకాలం తర్వాత బ్యాటింగ్‌లో చెలరేగిన రోహిత్.. సెంచరీతో మెరిశాడు. గత కొం తకాలంగా ఫామ్ కోసం తంటాలు పడుతున్న హిట్ మ్యాన్.. తిరిగి సత్తా చాటాడు. తనపై వరుసగా వస్తున్న విమర్శలకు బ్యాట్‌తోనే సమాదానం చెప్పాడు రోహిత్. 76 బంతుల్లో 9 ఫోర్లు, 7 సిక్స్‌లతో తనదైన శైలిలో రెచ్చిపోయి శతకం పూర్తి చేసుకున్నాడు. సిక్స్ కొట్టి సెంచరీ పూర్తి చేయడం విశేషం. ఇది రోహిత్‌కు 18 నెలల తర్వాత వన్డేల్లో తొలి సెంచరీ. 90 బంతుల్లో 12 ఫోర్లు, 7 సిక్స్‌లతో 119 పరుగులు చేశాడు రోహిత్. ఇది రోహిత్‌కు 32వ వన్డే శతకం.

**కోహ్లి విఫలం..**

శుభ్‌మన్ గిల్(60; 52 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) తో కలిసి భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు రోహిత్. ఈ జోడి తొలి వికెట్‌కు 135 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పిన తర్వాత గిల్ తొలి వికెట్‌గా పెవిలియన్ చేరాడు. ఆ తరుణంలో క్రీజ్‌లోకి వచ్చిన కోహ్లి(5) మరోసారి విఫలమయ్యాడు. 8 బంతుల్లో ఒక ఫోర్ కొట్టిన అనంతరం కోహ్లి పెవిలియన్ బాట పట్టాడు. ఆదిల్ రషీద్ బౌలింగ్‌లో సాల్ట్‌కు క్యాచ్ ఇచ్చి ఔట య్యాడు విరాట్.



**ఆకట్టుకున్న అయ్యర్**

కోహ్లి ఔటైన తర్వాత సెకండ్ డౌన్‌లో క్రీజ్‌లోకి వచ్చిన శ్రేయస్ అయ్యర్ ఆకట్టుకున్నాడు. రోహిత్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను పరుగులు పెట్టించాడు. ఒకవైపు రోహిత్ దూకుడుగా ఆడుతుంటే అయ్యర్.. స్ట్రైక్‌రొటేట్ చేస్తూ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఈ జోడి 70 పరుగులు జోడించిన తర్వాత రోహిత్ మూడో వికెట్‌గా ఔటయ్యాడు. లివింగ్ స్టోన్ బౌలింగ్ లో భారీ షాట్ ఆడబోయి రషీద్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. దాంతో 220 పరుగుల వద్ద రోహిత్ రూపంలో టీమిండియా మూడో వికెట్ ను కోల్పోయింది. రోహిత్ ఔటైన స్వల్ప వ్యవధిలోనే అయ్యర్ సైతం పెవిలియన్ చేరాడు. 47 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 44 పరుగులు చేసిన అయ్యర్..రనౌట్ అయ్యాడు.

**నిరాశపరిచిన రాహుల్.. మెరిసిన అక్షర్**

ఫోర్త్ డౌన్ లో బ్యాటింగ్ కు వచ్చిన కేఎల్ రాహుల్ మరోసారి నిరాశపరిచాడు. 14 బంతుల్లో 1 ఫోర్ సాయంతో 10 పరుగులు చేసిన రాహుల్.. జెమీ ఓవర్టాన్ బౌలింగ్ లో సాల్ట్ కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. అక్షర్ పటేల్ మాత్రం బ్యాటింగ్ లో మెరిశాడు. ఆడపా దడపా షాట్లుకొడుతూ నిలకడగా బ్యాటింగ్ చేశాడు. 43 బంతుల్లో 4 ఫోర్లతో 41 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు అక్షర్. అంతకుముందు టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్‌కు ఓపెనర్లు ఫిలిప్ సాల్ట్(26), బెన్ డకెట్(65)లు మంచి ఆరంభాన్ని ఇచ్చారు. ఈ జోడి 81 పరుగులు జత చేసిన తర్వాత సాల్ట్ తొలివికెట్ గా పెవిలియన్ చేరాడు. వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో రవీంద్ర జడేజాకు క్యాచ్ ఇచ్చి సాల్ట్ ఔటయ్యాడు. అనంతరం జో రూట్ తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు డకెట్. అయితే వీరి భాగస్వామ్యం ఎంతో సేపో నిలవలేదు. డకెట్‌ను రవీంద్ర జడేజా పెవిలియన్ కు పంపాడు. ఆపై బ్రూక్(31), జాస్ బట్లర్(34)లు కాస్త ఫర్వాలేదనిపించారు. జో రూట్ 72 బంతుల్లో 6 ఫోర్ల సాయంతో 69 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. ఆఖరి ఓవర్ వరకూ లివింగ్‌స్టోన్(41) ఉండటంతో ఇంగ్లండ్ 49.5 ఓవర్లలో 304 పరుగులు చేసింది. టీమిండియా బౌలర్లలో రవీంద్ర జడేజా మూడు వికెట్లు సాధించగా, షమీ, హర్షిత్ రాణా, హార్దిక్ పాండ్యా, వరుణ్ చక్రవర్తిలకు తలో వికెట్ దక్కింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com